# క్రైమ్ THE మిర్రర్®

Voice of Anti Corruption

హైదరాబాద్
1-7-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 99

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




## జనసేనలోకి ఆమంచి?!

కృష్ణ మోహన్ తో బాలినేని శ్రీనివాస్ రెడ్డి కీలక చర్చలు

పార్టీలో చేరేందుకు రెడీ

2,3లో




## అరకుపై జనసేన గురి!

పార్లమెంట్ స్థానంతో పాటు ఏడు అసెంబ్లీ స్థానాలపై ఫోకస్..

పొత్తులో భాగంగా ఆ సీట్లన్నీ తీసుకునేందుకు నిర్ణయం

## బిజెపిలోకి కోమటిరెడ్డి

# రాజగోపాల్ రెడ్డి!?

### సీఎం రేవంత్ సభకు డుమ్మా

### ఢిల్లీలో కొనసాగుతున్న మంత్రాంగం



## మంత్రి పదవి రాకుంటే 15 మంది ఎమ్మెల్యేలతో జంప్

తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త వార్త హల్చల్ చేస్తోంది. ఓ 15 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బిజెపిలో చేరుతారన్న ప్రచారం సాగుతోంది. సీనియర్ నేత, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నేతృత్వంలో పెద్ద ఎత్తున ఎమ్మెల్యేలు బిజెపిలో చేరేందుకు సిద్ధపడుతున్నట్లు పొలిటికల్ వర్గాల్లో టాక్ నడుస్తోంది. గతంలో బిజెపిలో పని చేశారు రాజగోపాల్ రెడ్డి. కాంగ్రెస్ పార్టీ మంత్రి పదవి ఆఫర్ చేయడంతో 2023 ఎన్నికల ముందు చేరారు. అనుకున్నట్టుగానే మునుగోడు నుంచి భారీ మెజారిటీతో గెలిచారు.

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో :** అయితే గత మూడు సంవత్సరాలుగా మంత్రి పదవి ఊరిస్తూనే ఉంది. మధ్యలో ఓసారి మంత్రివర్గ విస్తరణ జరిగింది. కానీ రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి దక్కలేదు. అప్పటినుంచి ఆయన తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

**సీఎం సభకు గైర్హాజరు..**

త్వరలో తెలంగాణ మంత్రివర్గ విస్తరణ ఉంటుందన్న ప్రచారం సాగుతోంది. అందుకే తన వంతు ప్రయత్నాలు చేసేందుకు రాజగోపాల్ రెడ్డి ఢిల్లీ బాట పట్టినట్లు తెలుస్తోంది. ఒకవేళ పార్టీ హై కమాండ్ తనను పట్టించుకోకపోతే ప్రత్యామ్నాయ అడుగులు వేసే అవకాశం ఉంది. ఇప్పటికే రాజగోపాల్ రెడ్డి ఓ పదిహేను మంది ఎమ్మెల్యేల బృందాన్ని తయారు

- మిగతా 2వ పేజీలో

## ప్రపంచ ఏరోస్పేస్ రాజధానిగా తెలంగాణ

హైదరాబాద్ నుంచే ప్రపంచ విమానయాన భవిష్యత్‌కు దిశానిర్దేశం

గ్లోబల్ ఏరోస్పేస్ దిగ్గజాలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆహ్వానం

వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుల పనులు త్వరలో ప్రారంభం...

కొత్తగూడెం విమానాశ్రయానికి త్వరలో గ్రీన్ సిగ్నల్

అత్యాధునిక యుద్ధ విమానాల్లో 'మేడ్ ఇన్ తెలంగాణ'

3,2లో

## బిజెపిలో ప్రక్షాళన!

తెలంగాణలో జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ మూడు రోజుల పర్యటన

పార్టీలో గ్రూపు తగాదాలపై ఆరా

ఢిల్లీకి వెళ్లి కఠిన నిర్ణయం ప్రకటించే అవకాశం

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** తెలంగాణపై బిజెపి హై కమాండ్ ఫుల్ ఫోకస్ పెట్టింది.



## బిజెపిలో భారీ మార్పులు!

జాతీయ ప్రధాన కార్యదర్శి బిఎల్ సంతోష్ ఔట్

మధ్యప్రదేశ్, రాజస్థాన్ సీఎంలు చేంజ్

తీవ్ర నిర్ణయం దిశగా అధిష్టానం

**క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్:** భారతీయ జనతా పార్టీ 2029 సార్వత్రిక ఎన్నికలను టార్గెట్ చేసింది. కేవలం కేంద్ర మంత్రివర్గ విస్తరణ మాత్రమే కాదు. పార్టీలో సంస్థాగత మార్పులు చేయనుంది. ప్రస్తుతం ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ల తర్వాత పార్టీలో అత్యంత కీలక చక్రం తిప్పుతున్నారు జాతీయ ప్రధాన కార్యదర్శి బిఎల్ సంతోష్. అయితే ఇప్పుడు ఆయనను పక్కన పెట్టే ఆలోచనలో ఐ కమాండ్ ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. పార్టీలో సుదీర్ఘకాలం అంతర్గత వ్యవహారాలతో పాటు ఎన్నికల వ్యూహాలను శాసిస్తున్నారు సంతోష్. అయితే ఆయనను మాతృ సంస్థ ఆర్ఎస్ఎస్ లోకి పంపించేందుకు తెర వెనుక ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఢిల్లీ

3లో



## బిజెపిపై విజయ్ యుద్ధం!

నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ ప్రైవేటీకరణ పై ఆగ్రహం

కేంద్రానికి ఘాటు లేఖ

**క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్ :** తమిళనాడులో ద్రవిడ పార్టీలకు ఢీ కొట్టి అధికారంలోకి వచ్చారు దళపతి విజయ్. సినిమా రంగంలో రాణించి తనకంటూ

3లో

## పదవి ఎవ్వరికీ శాశ్వతం కాదు

ఎన్టీఆర్, ఇందిర లాంటి వారే ఓడారు

పదవి శాశ్వతం అని నేను కూడా భావించడం లేదు

ఇచ్చిన హామీ మేరకు మంచి పనులు చేయడమే నా లక్ష్యం

రాష్ట్రాన్ని అప్పుల బారి నుంచి గాడిన పెడుతున్నాం

రైతులను రుణమాఫీ, రైతు భరోసాతో ఆదుకుంటున్నాం

బకాసురుడు కెసిఆర్ చేసిన అప్పులు తీర్చలేక చస్తున్నాం

కెసిఆర్ హాయంలో జీతాలు కూడా సక్కగ ఇవ్వలేదు

కన్నకూతరు ఫోన్లు క ఊడా ట్యాప్ చేసిన ఘనుడు

మళ్ళీ వస్తే ఫోన్ ట్యాపింగ్ తప్ప మరేమీ ఉండదు

రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి వచ్చే ఛాన్స్ లేదు

శిల్పకళావేదిక సభలో సిఎం రేవంత్ విమర్శలు



2లో

## వైసీపీలో నేతల మౌనం!

మాజీ మంత్రుల మౌనముద్ర

పిలిచి హెచ్చరిస్తున్న అధినేత జగన్

తప్పుకుంటే కొత్తవారికి అవకాశం కల్పిస్తానని తేల్చి చెబుతున్న వైనం



2లో

## రైతుల సమస్యలు తెలిసిన వారం

అందుకే వారికి అండగా నిలుస్తున్నాం

కట్టుకథలు చెబుతున్న వారిని నమ్మకండి

రైతులకు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క పిలుపు

# క్రైమ్ THE మిర్రర్®

Voice of Anti Corruption

హైదరాబాద్
1-7-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 99

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




## జనసేనలోకి ఆమంచి?!

కృష్ణ మోహన్ తో బాలినేని శ్రీనివాస్ రెడ్డి కీలక చర్చలు

పార్టీలో చేరేందుకు రెడీ

2,3లో



## అరకుపై జనసేన గురి!

పార్లమెంట్ స్థానంతో పాటు ఏడు అసెంబ్లీ స్థానాలపై ఫోకస్..

పొత్తులో భాగంగా ఆ సీట్లన్నీ తీసుకునేందుకు నిర్ణయం

## బిజెపిలోకి కోమటిరెడ్డి

# రాజగోపాల్ రెడ్డి!?

### సీఎం రేవంత్ సభకు డుమ్మా

### ఢిల్లీలో కొనసాగుతున్న మంత్రాంగం



**మంత్రి పదవి రాకుంటే 15 మంది ఎమ్మెల్యేలతో జంప్**

తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త వార్త హల్చల్ చేస్తోంది. ఓ 15 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బిజెపిలో చేరుతారన్న ప్రచారం సాగుతోంది. సీనియర్ నేత, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నేతృత్వంలో పెద్ద ఎత్తున ఎమ్మెల్యేలు బిజెపిలో చేరేందుకు సిద్ధపడుతున్నట్లు పొలిటికల్ వర్గాల్లో టాక్ నడుస్తోంది. గతంలో బిజెపిలో పని చేశారు రాజగోపాల్ రెడ్డి. కాంగ్రెస్ పార్టీ మంత్రి పదవి ఆఫర్ చేయడంతో 2023 ఎన్నికల ముందు చేరారు. అనుకున్నట్టుగానే మునుగోడు నుంచి భారీ మెజారిటీతో గెలిచారు.

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో :** అయితే గత మూడు సంవత్సరాలుగా మంత్రి పదవి ఊరిస్తూనే ఉంది. మధ్యలో ఓసారి మంత్రివర్గ విస్తరణ జరిగింది. కానీ రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి దక్కలేదు. అప్పటినుంచి ఆయన తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

**సీఎం సభకు గైర్హాజరు..**

త్వరలో తెలంగాణ మంత్రివర్గ విస్తరణ ఉంటుందన్న ప్రచారం సాగుతోంది. అందుకే తన వంతు ప్రయత్నాలు చేసేందుకు రాజగోపాల్ రెడ్డి ఢిల్లీ బాట పట్టినట్లు తెలుస్తోంది. ఒకవేళ పార్టీ హై కమాండ్ తనను పట్టించుకోకపోతే ప్రత్యామ్నాయ అడుగులు వేసే అవకాశం ఉంది. ఇప్పటికే రాజగోపాల్ రెడ్డి ఓ పదిహేను మంది ఎమ్మెల్యేల బృందాన్ని తయారు

- మిగతా 2వ పేజీలో

## ప్రపంచ ఏరోస్పేస్ రాజధానిగా తెలంగాణ

### హైదరాబాద్ నుంచే ప్రపంచ విమానయాన భవిష్యత్‌కు దిశానిర్దేశం

గ్లోబల్ ఏరోస్పేస్ దిగ్గజాలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆహ్వానం

వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుల పనులు త్వరలో ప్రారంభం...

కొత్తగూడెం విమానాశ్రయానికి త్వరలో గ్రీన్ సిగ్నల్

అత్యాధునిక యుద్ధ విమానాల్లో 'మేడ్ ఇన్ తెలంగాణ'

3,2లో

## బిజెపిలో ప్రక్షాళన!

తెలంగాణలో జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ మూడు రోజుల పర్యటన

పార్టీలో గ్రూపు తగాదాలపై ఆరా

ఢిల్లీకి వెళ్లి కఠిన నిర్ణయం ప్రకటించే అవకాశం

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** తెలంగాణపై బిజెపి హై కమాండ్ ఫుల్ ఫోకస్ పెట్టింది.



## బిజెపిలో భారీ మార్పులు!

జాతీయ ప్రధాన కార్యదర్శి బిఎల్ సంతోష్ ఔట్

మధ్యప్రదేశ్, రాజస్థాన్ సీఎంలు చేంజ్

తీవ్ర నిర్ణయం దిశగా అధిష్టానం

**క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్:** భారతీయ జనతా పార్టీ 2029 సార్వత్రిక ఎన్నికలను టార్గెట్ చేసింది. కేవలం కేంద్ర మంత్రివర్గ విస్తరణ మాత్రమే కాదు. పార్టీలో సంస్థాగత మార్పులు చేయనుంది. ప్రస్తుతం ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ల తర్వాత పార్టీలో అత్యంత కీలక చక్రం తిప్పుతున్నారు జాతీయ ప్రధాన కార్యదర్శి బిఎల్ సంతోష్. అయితే ఇప్పుడు ఆయనను పక్కన పెట్టే ఆలోచనలో ఐ కమాండ్ ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. పార్టీలో సుదీర్ఘకాలం అంతర్గత వ్యవహారాలతో పాటు ఎన్నికల వ్యూహాలను శాసిస్తున్నారు సంతోష్. అయితే ఆయనను మాతృ సంస్థ ఆర్ఎస్ఎస్ లోకి పంపించేందుకు తెర వెనుక ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఢిల్లీ

3లో



## బిజెపిపై విజయ్ యుద్ధం!

నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ ప్రైవేటీకరణ పై ఆగ్రహం

కేంద్రానికి ఘాటు లేఖ

**క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్:** తమిళనాడులో ద్రవిడ పార్టీలకు ఢీ కొట్టి అధికారంలోకి వచ్చారు దళపతి విజయ్. సినిమా రంగంలో రాణించి తనకంటూ

3లో

## పదవి ఎవ్వరికీ శాశ్వతం కాదు

### ఎన్టీఆర్, ఇందిర లాంటి వారే ఓడారు

పదవి శాశ్వతం అని నేను కూడా భావించడం లేదు

ఇచ్చిన హామీ మేరకు మంచి పనులు చేయడమే నా లక్ష్యం

రాష్ట్రాన్ని అప్పుల బారి నుంచి గాడిన పెడుతున్నాం

రైతులను రుణమాఫీ, రైతు భరోసాతో ఆదుకుంటున్నాం

బకాసురుడు కెసిఆర్ చేసిన అప్పులు తీర్చలేక చస్తున్నాం

కెసిఆర్ హాయంలో జీతాలు కూడా సక్కగ ఇవ్వలేదు

కన్నకూతరు ఫోన్లు క ఊడా ట్యాప్ చేసిన ఘనుడు

మళ్ళీ వస్తే ఫోన్ ట్యాపింగ్ తప్ప మరేమీ ఉండదు

రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి వచ్చే ఛాన్స్ లేదు

శిల్పకళావేదిక సభలో సిఎం రేవంత్ విమర్శలు



2లో

## వైసీపీలో నేతల మౌనం!

మాజీ మంత్రుల మౌనముద్ర

పిలిచి హెచ్చరిస్తున్న అధినేత జగన్

తప్పుకుంటే కొత్తవారికి అవకాశం కల్పిస్తానని తేల్చి చెబుతున్న వైనం



2లో

## రైతుల సమస్యలు తెలిసిన వారం

అందుకే వారికి అండగా నిలుస్తున్నాం

కట్టుకథలు చెబుతున్న వారిని నమ్మకండి

రైతులకు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క పిలుపు

# బిజెపిలోకి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి!?

(మొదటి పేజీ తరువాయి)

చేసుకున్నారని.. మంత్రి పదవి ఇవ్వని మరుక్షణం ఆ 15 మందితో బిజెపిలో చేరేందుకు ఒప్పందం చేసుకున్నారని ఢిల్లీ పొలిటికల్ సర్కిల్స్ లో ప్రచారం జరుగుతోంది. ఈ ప్రచారానికి తగ్గట్టుగానే నల్గొండలో సీఎం రేవంత్ సభకు దుమ్మా కొట్టారు రాజగోపాల్ రెడ్డి. మునుగోడు నుంచి కాంగ్రెస్ క్యాడర్ వెళ్లకుండా కూడా నియంత్రించారు. స్వయంగా తన సోదరుడు, మంత్రి అయిన కోమటిరెడ్డి వెంకటరెడ్డి శాఖకు సంబంధించిన కార్యక్రమానికి సైతం రాజగోపాల్ రెడ్డి గైర్హాజరు కావడం సంచలనంగా మారింది.

**మంత్రి కావాలన్నది లక్ష్యం..**

మంత్రి పదవి చేపట్టాలన్నది కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి లక్ష్యం. అయితే క్యాబినెట్లో అతడి సోదరుడు వెంకటరెడ్డి ఉన్నారు. ఒకే ఇంట్లో ఇద్దరికీ మంత్రి పదవులు దక్కే ఛాన్స్ లేదు. ఇప్పుడు రాజగోపాల్ రెడ్డికి అవకాశం ఇవ్వాలంటే కచ్చితంగా వెంకట్ రెడ్డిని తొలగించాలి. కానీ వెంకట్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతూ వస్తున్నారు. రాజగోపాల్ రెడ్డి మాత్రం కాంగ్రెస్కు గుడ్ బై చెప్పి బిజెపిలో చేరారు. అందుకే ఆయన విషయంలో కాంగ్రెస్ పార్టీ వెనుకడుగు వేస్తున్నట్లు ప్రచారంలో ఉంది. అయితే మంత్రి పదవి కోసం పట్టువదలని విక్రమార్కుడిలా ప్రయత్నిస్తూనే ఉన్నారు. ఇప్పుడు చివరి ప్రయత్నం గా ఢిల్లీ వెళ్లినట్లు తెలుస్తోంది.

**15 మంది ఎమ్మెల్యేలతో సిద్ధం..**

వివిధ రాష్ట్రాల్లో జరుగుతున్న రాజకీయ పరిణామాలు అందరికీ తెలిసిన విషయమే. ముఖ్యంగా బీజేపీ వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా గెలవాలని చూస్తోంది తెలంగాణలో. తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో తాజాగా జరుగుతున్న పరిణామాలను నిశితంగా పరిశీలిస్తోంది. అందుకే రాజగోపాల్ రెడ్డి ద్వారా రాజకీయ డ్రామాకు తెరలేపినట్లు ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా ఓ 15 మంది కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలతో గోడ దూకేందుకు రాజగోపాల్ రెడ్డి సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. 2009లో తొలిసారిగా భువనగిరి నుంచి పార్లమెంట్ స్థానానికి పోటీ చేసి గెలిచారు రాజగోపాల్ రెడ్డి. 2016 నుంచి 2018 వరకు శాసనమండలి సభ్యుడిగా కూడా ఉండేవారు. 2018లో మాత్రం ఎమ్మెల్యేగా గెలిచారు. ఎమ్మెల్యేగా రాజీనామా చేసి బిజెపిలో చేరారు. మునుగోడు ఉప ఎన్నికల్లో ఓడిపోయారు. మళ్లీ 2023లో కాంగ్రెస్ పార్టీలోకి వచ్చి గెలిచారు ఎమ్మెల్యేగా. ఇప్పుడు మంత్రి పదవి రాకపోతే బిజెపిలోకి జంప్ అయ్యేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# బిజెపిలో ప్రక్షాళన!

ముఖ్యంగా జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత నితిన్ నబీన్ మూడు రోజుల తెలంగాణ పర్యటన రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. బెంగాల్ ఫలితాల తర్వాత తమ తదుపరి టార్గెట్ తెలంగాణ అని బిజెపి ప్రకటించింది. ఈ తరుణంలో ఏకంగా మూడు రోజులపాటు జాతీయ అధ్యక్షుడు తెలంగాణలో వాలిపోవడం చూస్తుంటే గట్టి ప్రణాళిక ఉన్నట్లు అర్థం అవుతోంది. బీహార్, చత్తీస్గఢ్ వంటి రాష్ట్రాల్లో పక్కా ఆర్గనైజర్ గా, వ్యూహకర్తగా పేరు తెచ్చుకున్నారు నితిన్ నబీన్. ఆయన వర్కింగ్ స్టైల్ భిన్నంగా ఉంటుంది. ఆయన మైకులు ముందు ఉపన్యాసాలు ఇచ్చే రకం కాదు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటారు. పార్టీలో ఉన్న వైఫల్యాలను గుర్తిస్తారు. ఇప్పుడు తెలంగాణ బిజెపి నేతల్లో అదే భయం. పర్యటనలో భాగంగా రంగారెడ్డి రూరల్ కార్యాలయాన్ని, 9 జిల్లాల పార్టీ కార్యాలయాలను ప్రారంభించిన ఆయన.. హైదరాబాద్ ప్రదర్శన మైదానంలో బూత్ అధ్యక్షులతో నేరుగా ముఖాముఖి నిర్వహించారు. అయితే అంతర్గతంగా కొన్ని నివేదికలను సైతం తెప్పించుకుంటున్నట్లు తెలుస్తోంది.

**విభేదాల పర్వం..**

తెలంగాణలో జాతీయ పార్టీగా ఉన్న బిజెపికి నేతల మధ్య విభేదాలు అనేవి పెద్ద తలనొప్పిగా మారాయి. పార్టీలో ఒకరంటే ఒకరు పడని పరిస్థితి ఏర్పడింది. ఎవరికివారుగా భావి ముఖ్యమంత్రిలుగా ప్రణాళికలు వేసుకుంటున్నారు. తమ ప్రాబల్యాన్ని పెంచుకునే క్రమంలో గ్రూపులు కడుతున్నారు. ఇది పార్టీ శ్రేణులకు ఎంత మాత్రం మింగుడు పడని విషయం. ప్రధానంగా సీనియర్లు వర్సెస్ వలస నేతలు అన్నట్టు ఉంది ఇక్కడి పరిస్థితి. దీనిపై ఇప్పటికే హై కమాండ్ దృష్టి పెట్టింది. ఇప్పుడు నేరుగా జాతీయ అధ్యక్షుడు రంగంలోకి దిగడంతో బిజెపి నేతల్లో ఒక రకమైన టెన్షన్ కనిపిస్తోంది. ఇప్పటికే శంషాబాద్, నాంపల్లి వేదికలపై నితిన్ నబీన్ గట్టి హెచ్చరికలు పంపారు పార్టీ శ్రేణులకు.

**బెంగాల్ ఫార్ములాతో..**

బెంగాల్ తరహాలో తెలంగాణలో సైతం అద్భుత విజయం అందుకోవాల్సిన అవసరం ఉందని నితిన్ నబీన్ అభిప్రాయపడ్డారు. త్వరలో జరగబోయే గ్రేటర్ ఎన్నికలను కూడా ఆయన సెమీఫైనల్స్ కు అభివర్ణించారు. గ్రూపు తగాదాలతో కాలక్షేపం చేసే నేతలను కాకుండా, గల్లీలో ప్రజల పక్షాన నిలబడే వారికి ఇకపై ప్రాధాన్యత ఉంటుందని తేల్చి చెప్పారు. మరోవైపు జాతీయ అధ్యక్షుడు రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి లాంటి ప్రముఖులతో సుదీర్ఘంగా చర్చించారు. పార్టీలో గ్రూపు నేతల విషయం తెలుసుకున్నట్లు తెలుస్తోంది. ఈ మూడు రోజుల క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత నితిన్ నబీన్ ఢిల్లీ వేదికగా కొన్ని కఠినమైన నిర్ణయాలు తీసుకునే ఛాన్స్ కనిపిస్తోంది.

# అరకుపై జనసేన గురి!

(మొదటి పేజీ తరువాయి)

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో :** అరకు పార్లమెంటు స్థానంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది జనసేన. ఆ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో వచ్చే ఎన్నికల్లో పోటీకి ఆ పార్టీ సిద్ధపడుతోంది. అరకు ఎంపీ సీటుతో పాటు దాని పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలను జనసేన కైవసం చేసుకునేందుకు గట్టి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అరకు పార్లమెంటు పరిశీలకుడిగా నియమితులైన మెగా బ్రదర్ నాగబాబు ఈ విషయాన్ని స్వయంగా ప్రకటించారు. ఇప్పటికే అరకు పార్లమెంట్ పరిధిలోని పాలకొండ అసెంబ్లీ స్థానాన్ని జనసేన కైవసం చేసుకుంది. అరకు పార్లమెంటు స్థానంతో పాటు మిగతా ఏడు నియోజకవర్గాల్లో సైతం జనసేన జెండా ఎగురువేసే ందుకు ఇప్పటినుంచి ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది.

**టిడిపికి దక్కని పట్టు..**

అరకు పార్లమెంటు స్థానంతో పాటు ఎస్టీ నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీ గెలవడం చాలా అరుదు. 2014కు ముందు కాంగ్రెస్ పార్టీ హవా ఉండేది ఆ నియోజకవర్గాల్లో. వైసిపి ఆవిర్భావం నుంచి ఆ పార్టీకి వెన్నుదన్నుగా నిలుస్తూ వస్తున్నారు గిరిజనులు. కానీ మొన్నటి ఎన్నికల్లో కొంత మార్పు కనిపించింది. అరకు పార్లమెంట్ స్థానం పరిధిలోని పాలకొండ నుంచి జనసేన గెలిచింది. సాలూరు, రంపచోడవరం, కురుపాం, పార్వతీపురం నియోజకవర్గాల్లో టిడిపి అభ్యర్థులు గెలిచారు. అరకు తో పాటు పాడేరు అసెంబ్లీ స్థానంలో మాత్రం వైసీపీ గెలిచింది. అయితే ఎస్టీ నియోజకవర్గాలపై పవన్ కళ్యాణ్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రత్యేకంగా దృష్టిపెట్టారు. అందుకే వచ్చే ఎన్నికల్లో పొత్తులో భాగంగా ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గాల్లో జనసేన పోటీ చేసే ఛాన్స్ కనిపిస్తోంది.

**ఆ ఓటు బ్యాంకు పై పవన్ ఫోకస్..**

కాంగ్రెస్ పార్టీ సంప్రదాయ ఓటు బ్యాంకులో గిరిజనులు ఒకరు. టిడిపి ఆవిర్భావించిన తర్వాత ఎస్టీ నియోజకవర్గాల్లో రాణించింది చాలా తక్కువ.. అంతలా అక్కడ కాంగ్రెస్ ప్రభావం చూపుతూ వచ్చింది. అయితే ఈ సంప్రదాయ ఓటు బ్యాంకు వైసీపీ ఆవిర్భావం తర్వాత ఆ పార్టీ వైపు టర్న్ అయింది. 2014, 2019 ఎన్నికల్లో ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గాలను ఏకపక్షంగా గెలుచుకుంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. అయితే మొన్నటి ఎన్నికల్లో మాత్రం మిశ్రమ ఫలితాలు వచ్చాయి. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గిరిజనుల విషయంలో ఒక వ్యూహాత్మక వైఖరితో ముందుకు వెళు తున్నారు పవన్ కళ్యాణ్. గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేకంగా దృష్టి సారించారు. పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు కూడా చేపట్టారు. అయితే ఇదంతా 2029 ఎన్నికల కోసమేనని ఇప్పుడు అర్థం అవుతోంది. అరకు పార్లమెంట్ స్థానంతో పాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు లో జనసేన పోటీ చేసే ఛాన్స్ కనిపిస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో.

## రైతుల సమస్యలు తెలిసిన వారం

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్: తమ ప్రభుత్వానికి రైతుల కష్టాలు, వారి పంట కొనుగోలు సమస్యలు పూర్తిగా తెలుసని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. అందుకే రైతులు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేశామని, అన్నదాతలకు పూర్తి భరోసా కల్పించేందుకే ఈ నిధులను విడుదల చేస్తున్నామని స్పష్టం చేశారు. రైతు భరోసా ఇచ్చి తీరుతామని, తాము అబద్దాలు చెప్పి పొద్దు గడుపుకునే రకం కాదని హితవు పలికారు. శిల్పకళావేదికలో అట్టహాసంగా నిర్వహించిన రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , పలువురు మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ అబద్దాలు చెబుతూ పబ్బం గడుపుకునే నేతల మాటలు నమ్మవద్దన్నారు. కేటీఆర్, హరీష్ రావుల తీరుపై భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంపై పడి వీరిద్దరూ కట్టుకథలు అల్లుతూ తిరుగుతున్నారని మండిపడ్డారు. పదేళ్లు మంత్రిగా పనిచేసిన హరీష్ రావు, ఇప్పుడు కాంగ్రెస్ పెట్టేది ఆశీర్వాద సభ కాదు క్షమాపణ సభ అనడం చూస్తుంటే.. అసలు ఆయన పదేళ్లు మంత్రిగా ఎలా పనిచేశాడో అర్థం కావడం లేదన్నారు. రాష్ట్రాన్ని దారుణంగా దోపిడీ చేసి, ఇప్పుడు ఏమీ తెలియనట్టు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# వైసీపీలో నేతల మౌనం!

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో :** వైసీపీ మాజీ మంత్రులపై జగన్ సీరియస్ అయ్యారా? వారు మౌనం పాటించడం పై ఆగ్రహం వ్యక్తం చేశారా? యాక్టివ్ కాకుంటే కొత్త నేతలను రంగంలోకి దించుతానని హెచ్చరించారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో పదవులు అనుభవించిన వారు వ్యూహాత్మకంగా సైలెన్స్ పాటిస్తున్నారు. కొందరు పక్క రాష్ట్రాల్లో వ్యాపారాలు చేసుకుంటున్నారు. సొంత పనుల్లో నిమగ్నమయ్యారు. అటువంటి వారిని పిలిచి మాట్లాడుతున్నారు జగన్మోహన్ రెడ్డి. పార్టీలో యాక్టివ్ కాకుంటే మార్చేస్తానని హెచ్చరిస్తున్నారు.

**అధికారంలో ఉన్నప్పుడు..**

గతంలో అధికారంలో ఉన్నప్పుడు విపక్షాలపై ఓ రేంజ్ లో విరుచుకు పడేవారు కొందరు నేతలు. అటువంటి వారికి పిలిచి మరీ పదవులు ఇచ్చారు జగన్మోహన్ రెడ్డి. అయితే పవర్ పోయేసరికి అటువంటి నేతలు అంతా సైలెన్స్ లోకి వెళ్లారు. గతంలో చంద్రబాబుతో పాటు పవన్ కళ్యాణ్ పై విరుచుకుపడిన నేతలంతా ఎందుకో మౌనం దాల్చుతున్నారు. ముఖ్యంగా మాజీ మంత్రులు కొడాలి నాని, అనిల్ కుమార్ యాదవ్, వెల్లంపల్లి శ్రీనివాస్, ఉషశ్రీ చరణ్ మౌనంగా ఉన్నారు. కారుమూరు నాగేశ్వరరావు గుంభనంగా వ్యవహరిస్తున్నారు. ధర్మాన ప్రసాదరావు, బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, తానేటి వనిత తదితరులు కూటమిపై కనీసం స్పందించడం లేదు. ఇందులో కొందరైతే నియోజకవర్గాల ముఖం కూడా చూడడం లేదు. దీంతో ఈ మాజీలపై జగన్ సీరియస్ గా ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది.

**పార్టీ కార్యక్రమాలకు దూరంగా..**

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోయి రెండేళ్లు అవుతోంది. కనీసం చాలామంది నేతలు యాక్టివ్ కావడం లేదు. నియోజకవర్గాల ముఖం చూడడం లేదు. పార్టీ కార్యక్రమాలు చురుగ్గా చేపట్టడం లేదు. ఇప్పుడు ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ కొనసాగుతున్న పట్టించుకోవడం లేదు. వైసీపీలో ఒక వెలుగు వెలిగి అనేక రకాల కారణాలు చూపుతూ సైలెన్స్ పాటిస్తున్న నేతలను ఇప్పుడు జగన్ వరుసగా పిలుస్తున్నారు. ఎందుకు క్రియాశీలకం కావడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఇష్టం లేకపోతే తప్పుకోండి.. కొత్తవారికి అవకాశం కల్పిస్తానని హెచ్చరిస్తున్నారు. దీంతో నేతలు అటువంటిదేమీ లేదని.. యాక్టివ్ అవుతామని చెబుతున్నారు.

## గట్టి వార్నింగ్..

ప్రస్తుతం కూటమి దూకుడు మీద ఉంది. మూడు పార్టీలు చక్కటి సమన్వయంతో ముందుకు సాగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో నియోజకవర్గాల్లో వైసీపీ దూకుడు పెంచకపోతే ఇబ్బందికర పరిస్థితులు వస్తాయని తెలుసు. అందుకే జగన్మోహన్ రెడ్డి నేతలను పిలిచి మరి వార్నింగ్ ఇస్తున్నారు. యాక్టివ్ కావాల్సిందేనని తేల్చి చెబుతున్నారు. కొందరు నేతలు వ్యాపారాల్లో నిమగ్నమై పార్టీని పట్టించుకోని విషయాన్ని కూడా ప్రస్తావిస్తున్నారు. అటువంటివారు గౌరవంగా తప్పుకుంటే కొత్త వారికి అవకాశం ఇస్తానని చెబుతున్నారు. దీంతో వైసిపి నేతల్లో ఒక రకమైన టెన్షన్ కనిపిస్తోంది.



# పదవి ఎవ్వరికీ శాశ్వతం కాదు

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** పదవి ఎవరికీ శాశ్వతం కాదని, కేవలం ఇచ్చిన మాటే శాశ్వతంగా ఉంటుందని.. నాడు ఇందిరమ్మ, ఎన్టీఆర్ లాంటి మహానాయకులే ఓడిపోయారని సిఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. నాకు కూడా అంతేనని, పదవి శాశ్వతంగా ఉంటుందని నేను కూడా భావించడం లేదన్నారు. అయితే ఉన్నన్ని నాళ్లు మంచి పనులు చేసి, మంచివాడనిపించుకోవడమే ముఖ్యమని అన్నారు. నేను అబద్దాలు చెప్పను, చెప్పింది చేసి తీరుతా. ప్రజలకు నచ్చకపోయినా ఉన్నది ఉన్నట్లే చెప్తాను అని స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వం ప్రజలది, రైతులది, ఆడబిడ్డలది అని భరోసా ఇచ్చారు. కేసీఆర్ లాంటి తప్పుడు పనులు తాను ఎప్పటికీ చేయనని చెప్తూ.. ఆ పశుపతిని (కేసీఆర్ను) నీ ఫార్మ్హౌస్లోనే బంధించాను, ఇక బయటకు రానిచ్చే ప్రసక్తే లేదు‘ అని సీఎం రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు. శిల్పకళావేదిక వేదికగా జరిగిన రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విపక్షాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గత పాలకుల తీరును ఎండగడుతూ పదునైన వ్యాఖ్యలు చేశారు. ప్రజలు బకాసురుడిని తీసుకెళ్లి ఫార్మ్హౌస్లో కూర్చోబెట్టారని కేసీఆర్ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఆయన అన్నీ మీకే చేశాడని, మళ్లీ అధికారంలోకి రావాలని అంటున్నాడు. అసలు మనకేం చేశాడు? మళ్లీ ఎందుకు వస్తాడు అని సీఎం ప్రశ్నించారు. గత పదేళ్లలో అగ్రికల్చర్, హార్టికల్చర్లను పూర్తిగా పక్కనపెట్టేసి, రాష్ట్రంలో 'డ్రింకింగ్ కల్చర్' తీసుకువచ్చారని మండిపడ్డారు. బకాసు9రుడు చేసిన అప్పులను మేము తీరుస్తున్నామని అన్నారు. మళ్లోసారి కేసీఆర్ వస్తే భార్యాభర్తల మాటలను వినడం తప్ప చేసేదేమీ లేదన్నారు. కన్న బిడ్డ కవిత, అల్లుడు మాట్లాడుకున్న మాటలు విన్నారని ఫోన్ ట్యాపింగ్పై రేవంత్ ఘాటు విమర్శలు చేశారు. 30 నెలల్లో రైతు సంక్షేమం కోసం అనేక పనులు చేశామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. 19 మంది ముఖ్యమంత్రులు రాష్ట్రానికి రూ.69 వేల కోట్లు అప్పు చేశారని, 2014 నాడు రాష్ట్రం ఏర్పడినప్పుడు రాష్ట్రానికి రూ.69 వేల కోట్లే అప్పు ఉందని సీఎం గుర్తుచేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రూ.8 లక్షల 11 వేల కోట్ల అప్పు అయిందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. కేవలం కల్వకుంట్ల కుటుంబం ఏడు లక్షల కోట్లకు పైగా అప్పు చేసిందని సీఎం చెప్పారు. రాష్ట్రం ఏర్పడిన టైంలో మిగులు బడ్జెట్ ఉండేదని, రాష్ట్రం కోలుకోకుండా కేసీఆర్ అప్పులు చేశారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. అప్పులు కాదు.. అందిన కాడ చేబదులు కేసీఆర్ తీసుకొచ్చారని.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే నాటికి ఉద్యోగులకు జీతాలు వాయిదాల్లో ఇచ్చారని బీఆర్ఎస్ పాలనను సీఎం రేవంత్ దుయ్యబట్టారు. ధనిక రాష్ట్రంలో జీతాలు ఇవ్వలేని స్థితికి కేసీఆర్ తీసుకెళ్లారని సీఎం రేవంత్ విమర్శించారు. కాంట్రాక్టర్లు, సర్పంచులకు బకాయిలను కేసీఆర్ ఇవ్వలేదని, కేసీఆర్ సర్కార్ వల్లే మాజీ సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నారని సీఎం ఆరోపించారు. బకాయిలు బకాసురుడు పెడితే.. కట్టే పాపం తనపై పడిందని సీఎం రేవంత్ చెప్పుకొచ్చారు. స్కూల్లోని పిల్లలకు మిడ్ డే మీల్స్ పెట్టేవాళ్లకు బకాయిలు పెట్టారని.. బీఆర్ఎస్ సర్కార్ అప్పులే కాదు.. తప్పులు కూడా చేసిందని సీఎం విమర్శించారు. దేశంలో ఎక్కడికి పోయినా ఇజ్జత్ పోయేలా కేసీఆర్ చేశారని, చంద్రశేఖర్ దెబ్బకు రాష్ట్రంలోని ప్రజలంతా బికారులయ్యామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. తవ్వుతున్న కొద్దీ.. గుట్టల కొద్దీ అప్పులు బయటపడ్డాయని.. బీఆర్ఎస్ హయాంలో కట్టిన కాళేశ్వరం కూలేశ్వరం అయిందని సీఎం రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఇదే వేదికపై నుంచి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై, ప్రధాని మోదీపై కూడా రేవంత్ రెడ్డి విమర్శనాస్త్రాలు సంధించారు. దేశంలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తానని చెప్పిన మోదీ, ఆ ఉద్యోగాలు ఎవరికిచ్చారని నిలదీశారు. ఇక్కడ ఇద్దరికే ఉద్యోగాలు వచ్చాయని, వారు కిషన్ రెడ్డి, బండి సంజయ్ అని ఎద్దేవా చేశారు. ‘అక్కడ పశ్చిమ బెంగాల్లో మమతా బెనర్జీ కాబట్టి మీ పప్పులు ఉడికాయి. బెంగాల్లో గెలవడానికి మీకు 15 ఏళ్లు పట్టింది. కానీ ఇక్కడికి మీరా వచ్చేది? ఇక్కడ మావాళ్లు ఉన్నారు, దంచి కొడతారు‘ అంటూ తెలంగాణలో బీజేపీ ఆటలు సాగవని హెచ్చరించారు. బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వంపై చేస్తున్న వ్యాఖ్యలకు రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. ‘దిగిపోవడానికి ఇది నీ అయ్యా జాగీరా? మేము మీకేం బానిసలం కాదు‘ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాడు రైతులను వరి వేసుకుంటే ఉరే అన్న కేసీఆర్, ఆయన మాత్రం ఫార్మ్హౌస్లో వడ్లు పండించి ఏకంగా 4200 క్వింటాళ్లు అమ్ముకున్నాడని ఆరోపించారు. రూ.లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం కూలినా.. ఇవాళ వరిసాగులో తెలంగాణ నంబర్ వన్గా నిలిచిందన్నారు. బోరు కింద పంటలు పండినా కాళేశ్వరం మహిమ అంటూ ప్రజలను మోసం చేశారని చెప్పారు. కేసీఆర్ ఒక్కసారైనా రైతు రుణమాఫీని పూర్తి చేశారా? దళితులకు మూడెకరాల భూమి ఇచ్చారా? ప్రజలకు ఏం చేశారని కేసీఆర్ మళ్లీ రావాలని అనుకుంటారు? పేదలకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లు, ఇంటికో ఉద్యోగం ఇచ్చారా? ఊరూరికి బెల్ట్ షాప్ తెచ్చి తాగుడు కల్చర్ నేర్పించారు.



# ప్రపంచ ఏరోస్పేస్ రాజధానిగా తెలంగాణ



హైదరాబాద్,జూన్ 30(ఆర్ఎన్ఎ): ప్రపంచ ఏరోస్పేస్ పరిశ్రమకు తెలంగాణ కొత్త కేంద్రంగా అవతరిస్తోందని, ఇకపై అత్యాధునిక విమానాలు, యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, రక్షణ వ్యవస్థల తయారీలో హైదరాబాద్ ప్రపంచ పటంలో అగ్రస్థానంలో నిలవబోతోందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్‌లో జరిగిన ఏరోమార్ట్ హైదరాబాద్-2026 అంతర్జాతీయ ఏరోస్పేస్ / డిఫెన్స్ బిజినెస్ కన్వెన్షన్ ప్రారంభోత్సవంలో మంత్రి మాట్లాడుతూ, 'ప్రపంచ ఏరోస్పేస్ రంగం ఇప్పుడు తెలంగాణ వైపు చూస్తోంది. పెట్టుబడులు, పరిశ్రమలు, అత్యాధునిక సాంకేతికతకు తెలంగాణెళి కొత్త చిరునామా' అని స్పష్టం చేశారు. భారత వైమానిక దళంలో్గ ÷టైర్ పైలట్‌గా పనిచేసిన అనుభవాన్ని గుర్తు చేసుకుంటూ, సూపర్‌సోనిక్ యుద్ధ విమానాలను నడిపిన వ్యక్తిగా ఏరోస్పేస్ రంగంలో నాణ్యత, ఖచ్చితత్వం ఎంత కీలకమో తనకు ప్రత్యక్ష అనుభవం ఉందన్నారు. 'ఒక్క చిన్న విడిభాగం లోపం కూడా మిషన్ విజయాన్ని ప్రభావితం చేస్తుంది. అలాంటి అత్యున్నత ప్రమాణాలను తెలంగాణ పరిశ్రమలు నేడు విజయవంతంగా అందిస్తున్నాయి' అని చెప్పారు. అమెరికా అధ్యక్షుడి హెలికాప్టర్‌కు అవసరమైన క్యాబిన్లు, అపాచీ యుద్ధ హెలికాప్టర్ల నిర్మాణ భాగాలు, ఎఫ్?16 యుద్ధ విమానాల రెక్కలు, ప్రపంచ ప్రఖ్యాత ఏరో ఇంజిన్ విడిభాగాలు, ఎంఆర్ఓ వ్యవస్థలు నేడు తెలంగాణలోనే తయారవుతున్నాయని మంత్రి తెలిపారు. 'మేడ్ ఇన్ తెలంగాణ' అనే ముద్ర ఇప్పుడు ప్రపంచ ఆకాశంలో గర్వంగా ఎగురుతోంది' అని పేర్కొన్నారు. స్పెయిన్, కెనడాలకు చెందిన అంతర్జాతీయ దిగ్గజాలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టడం రాష్ట్ర పారిశ్రామిక విశ్వసనీయతకు నిదర్శనమన్నారు.

ఫ్రాన్స్, ఇటలీ సహా 25కిపైగా దేశాల కంపెనీలు ఏరోమార్ట్‌లో పాల్గొనడం తెలంగాణ అంతర్జాతీయ ప్రాధాన్యతను మరింత పెంచిందని తెలిపారు. తెలంగాణలో ఇప్పటికే 1,500కు పైగా ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలకు సేవలందిస్తున్న ఎంఎస్ఎంఈలు పనిచేస్తున్నాయని, పరిశ్రమలకు అవసరమైన అత్యాధునిక పారిశ్రామిక పార్కులు, ప్రత్యేక ఆర్థిక మండలాలు, ప్లగ్-అండ్-ప్లే మౌలిక సదుపాయాలు రాష్ట్రాన్ని దేశంలోనే అత్యంత ఆకర్షణీయ పెట్టుబడి గమ్యస్థానంగా మార్చాయని చెప్పారు. డీఆర్‌డీఓ, రక్షణ రంగ ప్రభుత్వ సంస్థలు, పరిశోధనా కేంద్రాలు, ప్రైవేట్ పరిశ్రమలు ఒకే నగరంలో ఉండటం హైదరాబాద్‌కు ప్రపంచ స్థాయి పోటీ సామర్థ్యాన్ని కల్పించిందన్నారు.

# జనసేనలోకి ఆమంచి?!

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** జనసేనలో చేరికలకు రంగం సిద్ధం అయిందా? పెద్ద ఎత్తున నేతలు జనసేనలో చేరుతారా? చేరికల కమిటీ తన పని మొదలుపెట్టిందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి. ముఖ్యంగా గ్రేటర్ రాయలసీమపై మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేకంగా ఫోకస్ చేసినట్లు ప్రచారంలో ఉంది. వైసీపీ నుంచి బలమైన నేతలను జనసేనలోకి రప్పించేందుకు ఆయన ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన ఆమంచి కృష్ణమోహన్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. త్వరలో కృష్ణమోహన్ జనసేనలో చేరుతారని ప్రకాశం జిల్లా రాజకీయాల్లో తెగ ప్రచారం నడుస్తోంది.

**అప్పట్లో కూడా..**

2024 ఎన్నికల కు ముందు ఆమంచి కృష్ణమోహన్ జనసేనలో చేరుతారని పెద్ద ఎత్తున టాక్ నడిచింది. అందుకు కారణం లేకపోలేదు. ఆయన సోదరుడు ఆమంచి స్వాములు ముందుగా జనసేనలో చేరారు. చాలా యాక్టివ్ గా పని చేశారు. చీరాల టికెట్ దక్కుతుందని ఆశించారు. కానీ ఆ సీటును వదులుకునేందుకు టిడిపి ఇష్టపడలేదు. దీంతో స్వాములకు అవకాశం ఇవ్వలేదు. ఆపై ఆమంచి కృష్ణమోహన్ జనసేనలో చేరేందుకు గ్రీన్ సిగ్నల్ లభించలేదు అప్పట్లో. దీంతో ఆయన షర్మిల పిలుపుతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆ పార్టీ అభ్యర్థిగా చీరాల నుంచి పోటీ చేశారు. దాదాపు 20వేల ఓట్లకు పైగా సొంతం చేసుకున్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత చీరాలలో రాజకీయ పరిణామాలు మారాయి. ఈ పరిస్థితుల్లో ఆమంచి కృష్ణమోహన్ తిరిగి వైసీపీలో చేరిపోతారని ప్రచారం సాగింది. కానీ అటువంటిదేమీ జరగలేదు. ఇప్పుడు ఆయన జనసేనలో చేరేందుకు పవన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ప్రచారం సాగుతోంది.

**మంచి నాయకుడిగా..**

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో తనకంటూ ఒక రాజకీయ ముద్రను చాటుకున్నారు ఆమంచి కృష్ణమోహన్. 2000లో కాంగ్రెస్ పార్టీ ద్వారా పొలిటికల్ ఎంట్రీ ఇచ్చారు. వేటపాలెం జడ్పిటిసి గా ఎన్నికయ్యారు. తరువాత ఎంపీపీగా కూడా పదవి చేపట్టారు. 2004లో కొనిజేటి రోశయ్య చీరాల నుంచి పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో రోశయ్య విజయం కోసం గట్టిగానే కష్టపడ్డారు ఆమంచి. 2009 ఎన్నికల్లో ప్రత్యక్ష రాజకీయాల నుంచి తప్పుకున్నారు రోశయ్య. అందుకే చీరాల నుంచి పోటీ చేసే అరుదైన అవకాశం ఆమంచి కృష్ణమోహన్ కు దక్కింది. ఆ ఎన్నికల్లో గెలిచిన ఆమంచి అసెంబ్లీలో అడుగుపెట్టారు. అయితే జగన్మోహన్ రెడ్డి పార్టీ ఏర్పాటు చేయడంతో వైసీపీలో చేరారు. 2014 ఎన్నికల్లో వైసీపీ టికెట్ దక్కకపోవడంతో నవోదయం పార్టీ తరఫున పోటీ చేసి గెలిచారు. అటు తరువాత తెలుగుదేశం పార్టీలో చేరి అధికార పార్టీ ఎమ్మెల్యేగా కొనసాగారు. 2019 ఎన్నికలకు ముందు వైసీపీలో చేరారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. అయితే టిడిపి ఎమ్మెల్యేగా ఉన్న కరణం బలరాం అనూహ్యంగా వైసీపీలోకి ఫిరాయించారు. దీంతో ఆమంచి కృష్ణమోహన్ కు ఇబ్బందులు ఎదురయ్యాయి. మొన్నటి ఎన్నికల్లో ఆమంచి కృష్ణమోహన్ కు కాకుండా కరణం వెంకటేష్ కు టికెట్ ఇచ్చారు జగన్. ఆ నిర్ణయాన్ని విభేదించి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇప్పుడు జనసేనలోకి వచ్చేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

# బిజెపిపై విజయ్ యుద్ధం!



ఒక ముద్ర చాటుకున్నారు. క్లీన్ ఇమేజ్ తో రాజకీయాల్లోకి వచ్చి సక్సెస్ అయ్యారు. తమిళనాడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అయితే జాతీయస్థాయిలో భారతీయ జనతా పార్టీ సమర శంఖం పూరించే ఛాన్స్ వచ్చింది విజయ్ కు. ఏపీలో విశాఖ స్టీల్ ప్లాంట్ మాదిరిగానే.. తమిళనాడులోని నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ లో కేంద్ర ప్రభుత్వం తనకున్న వాటాను మరో మూడు శాతం తగ్గించుకోవాలని చూస్తోంది. దీనిని వ్యతిరేకిస్తూ ప్రధాని నరేంద్ర మోడీకి తమిళనాడు సీఎం విజయ్ ఘాటుగా లేఖ రాశారు. నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ అనేది కేవలం ఒక షేర్ మార్కెట్ కంపెనీ కాదని.. దేశ ఇంధన భద్రతతో ముడిపడి ఉన్న ఒక వ్యూహాత్మక జాతీయ సంపదగా పేర్కొన్నారు. కేంద్రం తన వాటాను తగ్గించుకోవడం మంచిది కాదు అని తేల్చి చెప్పారు. దీంతో తమిళనాడులో మరో ఉద్యమం బిజెపికి వ్యతిరేకంగా పురుడుబోసుకునే అవకాశం ఉంది.

**విశాఖ స్టీల్ ప్లాంట్ మాదిరిగానే..**

ప్రధాని నరేంద్ర మోడీకి లేఖ రాసిన నేపథ్యంలో విజయ్ ఏపీలో విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రస్తావన తీసుకొచ్చారు. ఏపీ ప్రజలతోపాటు కార్మికులు ఎలాగైతే దశాబ్దాలుగా భూములు ఇచ్చి.. రక్తం ధారబోసి నిర్మించుకున్నారో.. ఈ నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ వెనుక కూడా తమిళ ప్రజల దశాబ్దాల త్యాగాలు ఉన్నాయని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం సేకరించిన భూములు కూడా ఉన్నాయని చెప్పుకొచ్చారు. అందుకే ఈ సమస్త పై తమిళనాడు ప్రజలకు నైతికమైన, శాశ్వతమైన హక్కు ఉందని ఆ లేఖలు ప్రత్యేకంగా ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం తన ఈక్విటీని ఎంత తక్కువగా తగ్గించినా.. అది భవిష్యత్తులో ప్రభుత్వ యాజమాన్య సంస్థల ఉనికికే ఒక ప్రమాదకరమని తేల్చి చెప్పారు. కేవలం ఆర్థిక లాభనష్టాల కోణంలో కాకుండా దేశ శాశ్వత ప్రయోజనాల దృష్ట్యా.. ఈ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**విజయ్ పై ప్రశంసలు..**

అయితే ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిగా విజయ్ కేంద్రానికి ఘాటుగా లేఖ రాయడం మాత్రం ప్రశంసలు అందుకుంటుంది. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణాంశం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో ప్రతిపాదించింది. అప్పట్లో ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి ఉన్నారు. కానీ అప్పట్లో ఈ రేంజ్ లో ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయలేదు. కానీ విజయ్ దూకుడు ప్రదర్శించారు. కానీ విజయ్ రాసిన ఈ లేఖను కేంద్ర ప్రభుత్వం పెద్దగా పరిగణలోకి తీసుకునే అవకాశం లేదు. ఎందుకంటే జాతీయస్థాయిలో నవరత్న, మహారత్న ప్రభుత్వ రంగ సంస్థలలో క్రమంగా పెట్టుబడులను ఉపసంహరించి.. ప్రైవేటు భాగస్వామ్యాన్ని పెంచాలన్నదే కేంద్ర ప్రభుత్వాలు ఆలోచన. దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల విషయంలో కేంద్ర వైఖరిని ప్రశ్నిస్తూ వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు లేఖలు రాశారు. ఆయా రాష్ట్రాల శాసనసభల్లో తీర్మానాలు చేసి ప్రతిపాదనలు పంపారు. అయినా సరే కేంద్రం తన వైఖరి మార్చుకోలేదు.

**మరో ఉద్యమం..**

అయితే రాష్ట్ర ప్రయోజనాల విషయంలో తమిళనాడు ప్రజల వైఖరి భిన్నంగా ఉంటుంది. కచ్చితంగా దీనిపై వారు ఉద్యమించే అవకాశం ఉంది. కాంగ్రెస్ సహకారంతో అధికారంలోకి వచ్చారు విజయ్. కచ్చితంగా ఈ విషయంలో జాతీయస్థాయిలో భారతీయ జనతా పార్టీని ఇరుకనపెట్టే ప్రయత్నం చేస్తారు. పైగా విజయ్ తొలిసారి ముఖ్యమంత్రి అయ్యారు. ఆయనను పాత కేసులతో ఇరికిస్తామంటే కుదిరే పని కాదు. పైగా విజయ్ వెనుక కాంగ్రెస్ పార్టీ ఉంటుంది. కచ్చితంగా ఆయన తమిళ ప్రజల్లో సెంటిమెంటు రగిలించి బిజెపి పై యుద్ధం ప్రకటిస్తారు అనేది విశ్లేషకులు మాట. మరి విజయ్ ఎలా వ్యవహరించబోతున్నారో చూడాలి.

# బిజెపిలో భారీ మార్పులు!

మరోవైపు దేశంలోనే కీలక రాష్ట్రాలైన మధ్యప్రదేశ్, రాజస్థాన్ ముఖ్యమంత్రి లను కూడా మార్చాలని బిజెపి హై కమాండ్ ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. మీరు రాష్ట్రాల్లో తలెత్తిన పరిణామాలు, ప్రభుత్వాల ఇమేజ్ డామేజ్ పై కేంద్ర పెద్దలు దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ప్రభుత్వాల పనితీరును గాడిలో పెట్టడమే కాకుండా.. రాబోయే సవాళ్లను తట్టుకునేలా కొత్త నాయకత్వాన్ని తీసుకురావడమే లక్ష్యంగా మార్పులు చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ కుటుంబం చుట్టూ భారీ భూ కుంభకోణం ఆరోపణలు వచ్చాయి. పార్టీకి అవి తలనొప్పిగా మారాయి. ఉజ్జయిని పరిసర ప్రాంతాల్లో సీఎం కుటుంబ సభ్యులు వందలాది ఎకరాల భూస్కాంకు పాల్పడ్డారు అన్నది ప్రధాన ఆరోపణ. పార్టీ ప్రతిష్టను జాతీయస్థాయిలో ఇబ్బందికరంగా మారింది. అందుకే మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మార్చాలన్న నిర్ణయానికి బిజెపి హై కమాండ్ వచ్చినట్లు తెలుస్తోంది.

**ప్రజల్లో అసంతృప్తి పెరుగుతుండడంతో..**

రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్లాల్ శర్మ మార్పు కూడా ఉంటుందని ఢిల్లీ పొలిటికల్ సర్కిల్స్ లో ప్రచారం సాగుతోంది. ఆయన పనితీరుపై హై కమాండ్ తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. ఆయన హయాంలో పరిపాలన లోపాలు, వివాదాస్పద నిర్ణయాలు, పార్టీ శ్రేణులతో సమన్వయ లోపం వంటి అంశాలపై జాతీయ నాయకత్వానికి నివేదికలు అందాయి. క్షేత్రస్థాయిలో ప్రభుత్వం పై వ్యతిరేకత పెరగకుండా.. ముందస్తు జాగ్రత్తగా అక్కడ కూడా సమర్థుడైన నాయకుడికి పగ్గాలు అప్పగించాలని హై కమాండ్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న బిఎల్ సంతోష్ తో పాటు రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మార్పు అంటే రాజకీయంగా సంచలనంతో కూడిన పని అని చెప్పవచ్చు.

# సిఎంతో హెచ్‌డిఎఫ్‌సి ప్రతినిధుల భేటీ

## సిఎస్ఆర్ నిధులతో చేపట్టిన పనులు ప్రారంభం

హైదరాబాద్: ఎంసీ.ఆర్.హెచ్.ఆర్డీ బోధీ పెవిలియన్ లో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ సిఎస్ఆర్ నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, రాజ్య సభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, భూపాలపల్లి ఎంఎల్ ఏ గండ్ర సత్యనారాయణ రావు, సీఎంవో ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, తెలంగాణ స్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా ఐతా ప్రకాష్ రెడ్డి ,హెచ్ డీఎఫ్ సి ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెండు అంబులెన్స్ ను ముఖ్యమంత్రి జెండా ఊపి ప్రారంభించారు. .వర్చువల్ గా భూపాలపల్లిలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మిషన్ ను ప్రారంభించారు. సమావేశం లో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ స్వయం సహాయక మహిళా సంఘాలకు విరివిగా రుణాలు మంజూరు చేయాలన్నారు.

# తిరుపతిలో ఎలుగుబంటి ప్రత్యక్షం

## వన్యప్రాణుల రాకతో స్థానికుల్లో భయం

తిరుపతి,జూన్: తిరుపతిలో ఓ ఎలుగుబంటి తన పిల్లలతో తిరగడం తీవ్ర కలకలం రేపింది. ఇటీవల అధ్యాత్మిక క్షేత్రం తిరుపతి నగర సరిహద్దు ప్రాంతాల్లో వన్యప్రాణుల సంచారం స్థానిక ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తోంది. తాజాగా తిరుమల నగర్ తెలుగు గంగ వాటర్ హౌస్ పైభాగంలో ఓ ఎలుగుబంటి పిల్లలతో తిరగడం కలకలం సృష్టించింది. ఎలుగుబంటి తన మూడు పిల్లలతో కలిసి ఈ ప్రాంతంలో స్వేచ్ఛగా సంచరిస్తూ స్థానికుల కంటపడింది. నివాస ప్రాంతాలకు అత్యంత సమీపంలో, ఎలుగుబంటి తిరుగుతుండటంతో ఏం జరుగుతుందోనని కాలనీవాసులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఈ విషయాన్ని గమనించిన వెంటనే స్థానికులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. కొంత కాలంగా శేషచల కొండల అంచున ఉండే తిరుమల నగర్, బీటీఆర్ కాలనీ, కృష్ణవేణి యాదవ్ కాలనీ తదితర పరిసర ప్రాంతాలలో రెండు నెలలుగా ఎలుగుబంట్లు తరచూ కనిపిస్తూనే ఉన్నాయి. ఆహారం, నీటి కోసమే ఇవి అడవి దాటి జనావాసాల్లోకి వస్తున్నాయని స్థానికులు భావిస్తున్నారు. ఎలుగుబంట్ల గుంపు కాలనీ వీధుల్లోకి వస్తే ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉందని, రాత్రి వేళల్లో ఇళ్ల నుంచి బయటకు రావడానికే భయపడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


GHMC
hmda Growing Global
TS-bPASS

MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com



SRI SWAMI ASSOCIATES
ARCHITECTS•ENGINEERS•SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions

వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.

H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

ఇప్పుడు పౌరసత్వానికి గుర్తింపు ఏంటన్న చర్చ జోరుగా సాగుతోంది. పాస్‌పోర్టు కాదన్నారు. ఆధార్ కూడా కాదన్నారు. ఓటరు ఐడి అంతకన్న కాదన్నారు. మరి ఏది మనలను భారతీయులు అని గుర్తించడానికి అన్నది..? దీనికి సమాధానం కనిపించడం లేదు. కాదన్నవారు చెప్పడం లేదు. సర్ ప్రక్రియ సాగుతున్న వేళ దీనిపై పెద్ద దుమారమే లేచింది. పాస్‌పోర్ట్ కూడా కాదన్నప్పుడు ఏది అన్న ప్రశ్న సహజంగానే వస్తోంది. అసలు మన దేశంలో పౌరసత్వాన్ని ఎలా గుర్తిస్తారు? రాజ్యాంగం ఏం చెబుతోంది? పాస్‌పోర్ట్ పౌరసత్వ ధృవీకరణ పత్రం కాకపోతే.. అసలైన గుర్తింపు ఏది? ఎవరు భారతీయులో తేల్చేది ఎవరు వంటి సందేహాలు ఇప్పుడు సామాన్యుల మదిని తొలుస్తున్నాయి.

విదేశీ వ్యవహారాల శాఖ ఏం చెప్పింది..మన దేశంలో చాలా మందికి పాస్‌పోర్ట్ ఉంటే అదే అసలైన పౌరసత్వ గుర్తింపు అని ఓ బలమైన నమ్మకం ఉంది. ఎవరైనా విదేశాలకు వెళ్లాలన్నా గుర్తింపు కార్డుగా చూపించాలన్నా అందరికీ ముందుగా గుర్తొచ్చేది పాస్‌పోర్టే. అయితే విదేశీ వ్యవహారాల శాఖ నుంచి వచ్చిన ఓ ప్రకటన ఇప్పుడు అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. పాస్‌పోర్ట్ కేవలం ప్రయాణ పత్రం మాత్రమేనని.. అది పౌరసత్వానికి నిదర్శనం కాదని ఇటీవల తేల్చి చెప్పింది. ఆధార్ కూడా కేవలం గుర్తింపు కార్డు మాత్రమేనని గతంలోనే తేల్చారు. ఇన్ని ప్రశ్నల మధ్య అసలు ఏంటన్నది కేంద్రమే తేల్చాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వంపైనే ఈ బాధ్యత ఉంది. పాస్‌పోర్ట్ సేవా దివస్ సందర్భంగా విదేశీ వ్యవహారాల శాఖ చేసిన ప్రకటన ఇప్పుడు దేశవ్యాప్తంగా పెద్ద చర్చకు దారితీసింది. భారతీయులకు పాస్‌పోర్ట్ కేవలం ఒక ట్రావెల్ డాక్యుమెంట్ మాత్రమేనని స్పష్టం చేసింది. ప్రభుత్వ అధికారుల పటిష్టమైన విచారణ తర్వాతే పౌరులకు దీన్ని జారీ చేస్తారు. భారత రిపబ్లిక్ పేరుతో జారీ అయ్యే ఈ పత్రం ప్రపంచవ్యాప్తంగా ఆమోదం పొందుతుంది. అయితే ఇది ఒక వ్యక్తిని భారతీయ పౌరుడిగా గుర్తించేందుకు చట్టబద్ధమైన నిదర్శనం ఎంతమాత్రం కాదు. మిగతా దేశాలతో పోలిస్తే భారత పౌరసత్వ నిర్ధారణలో ఒక పెద్ద సమస్య దాగి ఉంది. అమెరికా, బ్రిటన్ లాంటి దేశాల్లో పౌరులందరికీ ఒకే తరహా యూనివర్సల్ సిటిజన్ షిప్ సర్టిఫికెట్ ఉంటుంది. కానీ మన దేశంలో పౌరులందరికీ ఇచ్చే ఒకే ఒక్క పౌరసత్వ ధృవీకరణ పత్రం అంటూ ఏదీ లేదు. ఎక్కువ మంది భారతీయుల పౌరసత్వం పుట్టుక ఆధారంగానే వస్తుంది. చాలామంది పాతతరం భారతీయులకు ఓటరు జాబితాలు, స్కూల్ సర్టిఫికెట్లు, భూమి రికార్డులే ప్రధాన ఆధారాలు. వీటన్నింటినీ క్రమబద్ధీకరించేందుకే ఎన్నార్సీ అమలును గతంలో ప్రతిపాదించారు. అసోంలో అమలు చేసిన ఎన్నార్సీలో సరైన డాక్యుమెంట్లు లేక దాదాపు 19 లక్షల మంది జాబితాలో చోటు కోల్పోయారు. అందుకే రాజ్యాంగం కల్పించిన పౌరసత్వ

# మనం పౌరులమన్న దానికి గుర్తింపు ఏదీ ?

నిబంధనల పట్ల సరైన అవగాహన ఉండటం అత్యంత అవసరం. న్యాయపరమైన సవాళ్లు ఎదురైనప్పుడు.. కోర్టుల్లో పాస్‌పోర్ట్ చూపించి పౌరసత్వాన్ని నిరూపించుకోలేరు. భారత పౌరులు ఎవరనేది రాజ్యాంగంలోని ఆర్టికల్ 5 నుంచి 11 వరకు 1955 పౌరసత్వ చట్టం స్పష్టంగా నిర్వచించాయి. ఈ చట్టాల ప్రకారం ఏ ఒక్క పత్రం కూడా పౌరసత్వానికి పూర్తి స్థాయి ఆధారంగా పరిగణించదు. పౌరసత్వం అనేది పుట్టుక.. తల్లిదండ్రుల మూలాలు.. నివాసం ఆధారంగా వచ్చే ఒక చట్టపరమైన హోదా. మన దగ్గర ఉన్న రికార్డులు కేవలం ఆ వాస్తవాలను నిర్ధారించే సాక్ష్యాలుగా మాత్రమే పనిచేస్తాయి. ఉదాహరణకు ఆధార్, ఓటర్ ఐడీ, పాన్ కార్డ్ లాంటివి గుర్తింపు కార్డులు మాత్రమే కానీ అవే పౌరసత్వానికి తుది ఆధారాలు కావు. 1955 పౌరసత్వ చట్టం ప్రకారం పౌరసత్వాన్ని నాలుగు మార్గాల్లో పొందవచ్చు. మొదటిది పుట్టుకతో వచ్చే పౌరసత్వం. 1950 నుంచి 1987 మధ్య భారత్‌లో జన్మించిన వారందరూ సహజంగానే పౌరులు అవుతారు. ఆ తర్వాత 2003 వరకు

జన్మించిన వారిలో తల్లిదండ్రుల్లో కనీసం ఒక్కరైనా భారతీయులై ఉండాలి. ఇక రెండో మార్గం వారసత్వం. విదేశాల్లో పుట్టిన పిల్లల తల్లిదండ్రుల్లో ఒకరు భారతీయులై ఉండి.. ఏడాదిలోపు కాన్సులేట్‌లో నమోదు చేసుకుంటే పౌరసత్వం లభిస్తుంది. మూడోది రిజిస్ట్రేషన్ ద్వారా.. నాలుగోది నిర్దిష్ట కాలం దేశంలో ఉండటం ద్వారా పొందే పౌరసత్వం. ఇది కనీసం 12 ఏళ్ల పాటు భారత్‌లో నివసించిన విదేశీయులకు ఇస్తారు. పాకిస్థాన్ సింగర్ అద్నాన్ సమీకి ఇలాగే భారత పౌరసత్వం లభించింది. పౌరులు కాని వారికి పాస్‌పోర్టు ఇవ్వకూడదనే నియమం కూడా ఏమీ లేదు. పాస్‌పోర్ట్ చట్టంలోని సెక్షన్ 20 ప్రకారం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పరిస్థితుల్లో విదేశీయులకు కూడా ట్రావెల్ డాక్యుమెంట్లు జారీ చేయవచ్చు. దేశ ప్రయోజనాల దృష్ట్యా ఈ అధికారాన్ని కేంద్రం ఉపయోగిస్తుంది. రాజకీయ కారణాలతో ఏ దేశం లేని వాళ్లుగా మిగిలిపోయిన వారికి ఇలాంటి వెసులుబాటు ఇస్తారు. భారత్‌లో ఉంటున్న టిబెటన్ శరణార్థులకు, శ్రీలంక తమిళులకు వేరే దేశాలకు వెళ్లేందుకు ప్రత్యేక ప్రయాణ పత్రాలు జారీ చేస్తారు. ఇవన్నీ చూస్తే.. పాస్‌పోర్ట్ ఉంటే వారు పక్కా భారతీయులు అనుకోవడం పొరపాటే అవుతుంది. పౌరసత్వ వివాదాలపై దేశంలోని అత్యున్నత న్యాయస్థానాలు ఎన్నోసార్లు స్పష్టమైన తీర్పులు ఇచ్చాయి. సుప్రీంకోర్టు సహా పలు హైకోర్టులు పాస్‌పోర్టును ఒక గుర్తింపుగా మాత్రమే చూశాయి. ఓటరు నమోదు కోసం ఎన్నికల సంఘం పాస్‌పోర్ట్, జనన ధృవీకరణ పత్రాలను బలమైన సాక్ష్యాలుగా అంగీకరిస్తుంది. కానీ కోర్టులు మాత్రం పౌరసత్వ వివాదాల్లో వీటిని తుది ఆధారాలుగా అంగీకరించవు. పౌరసత్వాన్ని నిరూపించుకునే బాధ్యత పూర్తిగా సదరు వ్యక్తి పైనే ఉంటుందని కోర్టులు తేల్చి చెప్పాయి. దీంతో ఇప్పుడు పౌరసత్వ కార్డులు తీసుకోవాల్సిన అవసరం కూడ ఆ రావచ్చు. దీనికి కూడా కేంద్రం కసరత్తు చేస్తుందా అన్నది చూడాలి. ఆధార్‌ను పరిగణలోకి తీసుకోకుంటే సమగ్రమైన భారతీయతకు సంబంధించిన కార్డు లేదా పత్రం అవసరం ఏర్పడింది.

**తోటలో ఒక అందమైన మొక్కను నాటినప్పుడు, ప్రకృతిలోని ప్రతి ప్రాణీ ఒకే క్షణంలో స్పందించదు. రంగురంగుల పూల ప్రపంచంలో ప్రతి మొక్కా ఒకే సమయంలో మురిపెంగా పూవులు పూయదు. కొన్ని మొక్కలు నాటిన వారం రోజుల్లోనే చిరునవ్వులతో మొగ్గ తొడుగుతాయి, మరికొన్ని నెలల తరబడి కేవలం పచ్చని ఆకులు మాత్రమే వేస్తూ కాలపరీక్షకు నిలుస్తాయి. కానీ, తీరా ఒకరోజు అవి నిశ్శబ్దంగా పూచినప్పుడు, ఆ అద్భుతమైన పరిమళం ముందుగా పూసిన పువ్వుల సువాసన కంటే ఏమాత్రం తక్కువ ఉండదు. నిజానికి, ఆ సుగంధం గుండెలను తాకుతుంది.**



ప్రసాదించిన ఒక అదనపు సమయం మాత్రమే. ఒక సాధారణ విద్యార్థి ఒక పరీక్షలో మొదటిసారి విఫలమైతే, ఆ తాత్కాలిక వైఫల్యం అతనికి తనలోని లోపాలను, బలహీనతలను స్పష్టంగా గుర్తించే గొప్ప అవకాశాన్ని ఇస్తుంది. మలిసారి అతను మరింత పటిష్టమైన, వ్యూహాత్మకమైన సన్నద్ధతతో రంగంలోకి దిగుతాడు. అదే విధంగా, జీవితంలో ఆలస్యంగా విజయాలను అందుకున్నవారు తమ సుదీర్ఘ ప్రయాణంలో ఎదురైన ప్రతి అడ్డంకి నుంచి, ప్రతి ఓటమి నుంచి ఏదో ఒక విలువైన పాఠాన్ని నేర్చుకుంటూనే ఉంటారు. వారు సాధించిన ఆఖరి విజయం వెనుక, సమాజంలో తొందరగా విజయం సాధించిన వారికి ఎప్పటికీ లభించని పరిపక్వత, నిలకడైన ఓర్పు, లోతైన లోకజ్ఞానం దాగి ఉంటాయి. అందుకే, ఆలస్యంగా దక్కిన ఆ విజయం ఎంతో స్థిరంగా, సమాజానికి మరింత అర్థవంతంగా మారుతుంది. మనలో చాలామంది నిరంతరం పక్కవారితో, ఎదుటివారి తాత్కాలిక విజయాలతో మనల్ని మనం పోల్చుకుంటూ తీవ్రమైన మానసిక వేదనను కొనితెచ్చుకుంటూ ఉంటాం. కానీ, ప్రతి ఒక్క మనిషి జీవితం ఒక విలక్షణమైన, ప్రత్యేకమైన నవల వంటిది. ఒక

# కాలం మీది కాదు కావచ్చు... కానీ విజయం మీదే!

మన నిత్య మనిషి జీవితం కూడా సరిగ్గా ఇలాంటి ఒక అద్భుతమైన కాన్వాస్ లాంటిదే. కొందరు చాలా చిన్న వయసులోనే విజయ తీరాలను తాకి మురిసిపోతే, మరికొందరు జీవితంలో ఎన్నో ఆటంకాలను దాటుకుంటూ చాలా ఆలస్యంగా తమ కలల లక్ష్యాన్ని చేరుకుంటారు. అయితే, ఇక్కడ గమనించాల్సిన ముఖ్యమైన విషయమేమిటంటే, ఆలస్యం అయిందనే ఒకే ఒక్క కారణంతో వారు సాధించిన ఆ అద్భుత విజయం విలువ ఏమాత్రం తగ్గిపోదు. నిజానికి, కాలంతో పోరాడి ఆలస్యంగా వికసించిన పువ్వు తన పరిమళాన్ని సమాజంలో మరింత గాఢంగా, సుదీర్ఘంగా వెదజల్లుతుంది.

నేటి ఆధునిక, పరుగుల సమాజంలో ప్రతి చిన్న విషయానికీ ఒక కఠినమైన వయోపరిమితిని సృష్టించడం ఒక అలవాటుగా మారిపోయింది. ఇరవై ఏళ్లకే చేతిలో మంచి ఉద్యోగం ఉండాలి, ఇరవై ఐదేళ్లకే వైభవంగా వివాహం జరిగిపోవాలి, ముప్పై ఏళ్ల వయసు వచ్చేసరికి సొంత ఇల్లు, లగ్జరీ కారు ఉండాలనే ఒక అనధికారిక, అదృశ్య కాలపట్టికను నేటి కార్పొరేట్ సమాజం మన మెదళ్లపై బలవంతంగా రుద్దుతోంది. ఈ కృత్రిమ కాలపట్టికను అందుకోలేక, ఆ పరుగులో కాస్త వెనుకబడినప్పుడు, చాలామంది యువతీ యువకులు మానసికంగా కుంగిపోతూ, తమను తాము పూర్తి విఫలులుగా భావించుకుంటున్నారు. సోషల్ మీడియాలో స్నేహితుల విజయాల పోస్టులు చూస్తూ, వారు ముందుకు దూసుకుపోతుంటే, తాము మాత్రమే ఒకేచోట వెనుకబడిపోయామనే నిరాశాజనక భావన మనసును తీవ్రంగా గాయపరుస్తుంది. కానీ, ఇక్కడే మనం ఒక పరమ సత్యాన్ని పూర్తిగా మరచిపోతాం జీవితం అనేది ఎవరితోనో పోటీపడే ఒక పరుగు పందెం కాదు, అది మనతో మనం సాగించే ఒక నిరంతర ప్రయాణం. ప్రతి ప్రయాణానికీ దాని స్వంత వేగం, దాని స్వంత ప్రత్యేకమైన మార్గం ఖచ్చితంగా ఉంటాయి. మనం ఒకసారి ప్రపంచ చరిత్రను ఆసక్తిగా వెనక్కి తిరిగి చూస్తే, ఆలస్యంగా అద్భుత విజయాలు సాధించి ప్రపంచాన్ని శాసించిన ఎందరో మహనీయుల స్ఫూర్తిదాయక కథలు మనకు నిలువెత్తు సాక్ష్యాలుగా కనిపిస్తాయి. కల్నల్ శాండర్స్ అనే ఒక సామాన్య వ్యక్తి తన అరవై ఏళ్ల సుదీర్ఘ వయసులో, విశ్రాంతి తీసుకోవాల్సిన సమయంలో తన వినూత్న చికెన్ వంటకాన్ని వీధుల్లో అమ్మడం ప్రారంభించాడు. ఆ పట్టుదలే నేడు ప్రపంచవ్యాప్తంగా కోట్ల మంది మెచ్చే కేఎఫ్‌సీ సామ్రాజ్య స్థాపనకు పునాది వేసింది. అలాగే, సుప్రసిద్ధ అంతర్జాతీయ రచయిత్రి జె.కె. రౌలింగ్ తీవ్రమైన ఆర్థిక కష్టాలు, ఒంటరితనం, మానసిక సమస్యలను అనుభవిస్తూ ముప్పై ఏళ్ల వయసు దాటాక మాత్రమే హ్యారీ పాటర్ అనే అద్భుత నవలను ప్రపంచానికి పరిచయం చేశారు. మన తెలుగు నేలపైనే చూసుకుంటే, ఎందరో పేద రైతు బిడ్డలు, సాధారణ మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చిన యువకులు ఆలస్యంగానైనా కష్టపడి చదువు పూర్తి చేసి, సివిల్ సర్వీసెస్ వంటి ఉన్నత ఉద్యోగాలు సాధించి, తమ కుటుంబాల తలరాతలను మార్చిన ఉదాహరణలు అనేకం ఉన్నాయి. వీరందరి జీవితాలు చాటిచెప్పే ఒకే ఒక్క అమూల్యమైన సందేశం సమయం ఎంత ఆలస్యమైనా, అంతర్గత పట్టుదల వదలకపోతే విజయం మీ తలుపు తట్టడం ఖాయం. ఇందుకు అద్భుతమైన ఉదాహరణ చైనా వెదురు మొక్క. ఈ విచిత్రమైన మొక్కను నాటిన మొదటి నాలుగైదు సంవత్సరాల వరకు అది భూమి పైకి కంటికి కనిపించేలా ఏమాత్రం పెరగదు. దానికి నీరు పోస్తూ ఎంత సంరక్షించినా ఎలాంటి మార్పూ కనిపించదు. కానీ, ఆ నిశ్శబ్ద సమయంలో అది భూమి అంతర్భాగంలో అత్యంత లోతుగా, విస్తృతంగా తన వేర్లను బలంగా పాతుకుంటూ ఉంటుంది. ఐదో సంవత్సరం వచ్చేసరికి, అదే వెదురు మొక్క కేవలం కొన్ని వారాల వ్యవధిలోనే ఆకాశమంత ఎత్తుకు అద్భుతంగా పెరిగిపోతుంది. ఆ అనూహ్య వేగవంతమైన పెరుగుదలకు అసలు కారణం, అంతకుముందు ఐదేళ్లపాటు అది నిశ్శబ్దంగా నిర్మించుకున్న బలమైన పునాదే. మనం కూడా మన జీవితాల్లో ఒక్కోసారి అనుకున్న ఫలితాలు వెంటనే రాక నిరాశ చెందుతాం. కానీ, బయటకు కనిపించకపోయినా, లోపల మనం మరింత బలపడుతూనే ఉంటాం. సరైన సమయం వచ్చినప్పుడు, ఆ లోపలి బలమే మనల్ని అనూహ్యమైన ఎత్తులకు తీసుకువెళుతుంది. మన ప్రయాణంలో ఎదురయ్యే ఆలస్యం అనేది ఎప్పటికీ వైఫల్యానికి సంకేతం కాదు. నిజానికి, అది మనం భవిష్యత్తులో సాధించబోయే భారీ విజయానికి మరింత పటిష్టంగా సిద్ధం కావడానికి ప్రకృతి మనకు అద్భుతమైన పుస్తకంలోని రెండవ అధ్యాయం, మరొకరు రాసిన పుస్తకంలోని పదవ అధ్యాయం కంటే చాలా నెమ్మదిగా సాగుతుందని భావించి, దానిని ఒక విఫలమైన నవలగా కొట్టిపారేయలేం కదా! అలాగే, దేవుడు మనకు ప్రసాదించిన ఈ అమూల్యమైన జీవిత గమనాన్ని వేరొకరి గమనంతో పోల్చి అంచనా వేయడం మనకు మనమే చేసుకునే అతిపెద్ద అన్యాయం అవుతుంది. మనం నిత్యం చేయవలసింది ఒక్కటే నిన్నటి మనకంటే, ఈరోజు మనం ఎంత మెరుగ్గా ఉన్నాం అని నిరంతరం ప్రశ్నించుకోవడం. మనం సాధించే ఆ చిన్న చిన్న సానుకూల పురోగతులే మనల్ని చివరకు మన అత్యున్నత గమ్యానికి చేరుస్తాయి.కాబట్టి, ప్రియమైన పాఠకులారా, ప్రస్తుత జీవితంలో మీరు ఏ స్థితిలో ఉన్నా, మీ కలల లక్ష్యం ఇంకా చాలా దూరంగా ఉన్నట్టు అనిపించినా, మీరెప్పుడూ అధైర్యపడి నిరాశ చెందవలసిన అవసరం లేదు. ఈ అనంత సృష్టిలో ప్రతి ఒక్క పువ్వుకూ దాని స్వంత వికసన సమయం, ప్రత్యేకమైన కాలం ఖచ్చితంగా ఉంటాయి. మీ సమయం ఇంకా రాలేదంటే, దానికి అర్థం మీరు విఫలమయ్యారని కాదు, మీరు భవిష్యత్తులో ఒక మహా వృక్షంలా మారడానికి ఇంకా సిద్ధమవుతున్నారని అర్థం. నిలకడగా ఓపిక వహించండి, నిరంతరం శ్రమించండి, మీ ఆత్మవిశ్వాసాన్ని ఎక్కడా కోల్పోకండి. ఆలస్యంగానైనా సరే మీరు ఒకరోజు పరిపూర్ణంగా వికసించినప్పుడు, మీ విజయ పరిమళం యావత్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరుస్తుంది. ఎందుకంటే, చివరకు చరిత్రలో మిగిలేది మనం సమాజంలో ఎప్పుడు పూచామన్నది కాదు, ఎంత గొప్పగా వికసించామన్నదే ముఖ్యం! మీ అద్భుత విజయ వసంతం కోసం ఈ ప్రపంచం తప్పకుండా ఎదురొచ్చి స్వాగతం పలుకుతుంది.



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

# తెలంగాణపై విషం చిమ్మిన చౌహాన్

## ఎపిని పొగుడుతూ..తెలంగాణపై అక్కసు

తెలంగాణ రాష్ట్రంపై కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ఓ రకంగా విషం కక్కారు. ఇటీవల కేంద్ర మంత్రులు అడపాదడపా విషం కక్కుతూనే ఉన్నారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి మన రాష్ట్రానికే చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులకు పెద్దగా పట్టింపు లేదు. ఏదైనా పని కావాలని పట్టుబట్టి చేయించడం లేదు. ఈ క్రమంలో గ్రామీణాభివృద్ధి శాఖళ మంత్రుల సమావేశంలో శివరాజ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. గ్రామీణ పథకాల అమలులో తెలంగాణ వెనుకబడి ఉందన్నారు. అంతేగాకుండా ఆంధ్రా మత్రాం భేషుగ్గా పనిచేస్తోందని స్తుతించారు. చంద్రబాబు దయాదాక్షిణ్యాలతో మోడీ సర్కార్ నడుస్తోంది. అందుకే ఈ మధ్య బాబును పొగడం కేంద్రమంత్రులు బాగా అలవాటు చేసుకున్నారు. పనులు గట్టెక్కించుకునే క్రమంలో చంద్రబాబు కూడా మోడీని ఆకాశానికి ఎత్తుతున్నారు. కానీ మధ్యలో తెలంగాణలో తెగడాల్సిన పనిలేదు. కానీ ఇప్పుడు జరుగుతున్నది అదే. సోమవారం న్యూఢిల్లీలో గ్రామీణాభివృద్ధి పథకాల అమలుపై మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి 27 రాష్ట్రాల గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రులు హాజరయ్యారు. ఇందులో తెలంగాణ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం గురించి ఆయన మాట్లాడుతూ.. పీఎంజీఏస్‌వై రహదారుల పనులు వేగవంతం కావాలని పేర్కొన్నారు. పెండింగ్ రహదారి పనులు పూర్తి చేయాలని సూచించారు. పీఎం ఆవాస్ సర్వే త్వరగా పూర్తి చేయాలని తెలంగాణ గ్రామీణాభివృద్ధి మంత్రితోపాటు ఆ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖలో ఖాళీలు వెంటనే భర్తీ చేయాలని వారికి ఈ సందర్భంగా కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. అలాగే గ్రామాల అభివృద్ధే వికసిత్ భారత్‌కు పునాది కావాలని ఆయన ఆకాంక్షించారు. రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వాలకు ఆయన సూచించారు. జులై 1వ తేదీ నుంచి వికసిత్ భారత్ గ్రామీణ యోజన అమలు చేస్తున్నట్లు చెప్పారు. నిధుల వాటా సమయానికి విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ కోరారు. పనిలో పనిగా గ్రామీణాభి వృద్ధి పథకాల అమలులో ముందంజలో ఉందంటూ ఆంధ్రప్రదేశ్‌పై కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ ప్రశంసలు కురిపించారు. వీబీజీఆర్ఎంఏజీఐ నోటిఫికేషన్ పూర్తి చేసిన రాష్ట్రాల జాబితాలో ఏపీ ఉందన్నారు. జులై 2వ తేదీన తిరుపతిలో వీబీజీఆర్ఎంఏజీఐ ప్రారంభిస్తామని ప్రకటించారు. జాతీయ ప్రారంభోత్సవానికి ఆతిథ్య రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను ఎంపిక చేశామన్నారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన నాణ్యతలో దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రాల్లో ఏపీకి స్థానం దక్కిందని మంత్రి శివరాజ్‌సింగ్ వివరించారు. ఇదంతా కేవలం కావాలని చేస్తున్న ప్రకటనగానే చూడాలి. తెలంగాణపై విషం కక్కేందుకు ఎలాంటి అవకాశాన్ని కూడా కేంద్రం వదులుకోవడం లేదు. ఇక్కడ కాంగ్రెస్ అధికారంలో ఉన్నది పక్కన పెడితే కనీసం అభివృద్ధికి కేంద్రం తోడ్పాటు ఇవ్వడం లేదు. అభివృద్ధి ఆగిపోతే అది ప్రజలకే నష్టం అన్న జ్ఞానం ఇక్కడ ఉన్న ఇద్దరు మంత్రులకు కలగడం లేదు. బాబును పొగడడం కోసం ఎంతకైనా తెగిస్తారనడానికి ఇదే నిదర్శనం.

# పీఆర్పీ కోసం అధికారుల పోరు

## రెండో రోజూ రిలే నిరాహార దీక్షలు.. సమ్మెకు వెనుకాడబోమని హెచ్చరిక




**మందమర్రి, జూన్ 30 (క్రైమ్ మిర్రర్) :** సింగరేణి అధికారుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మందమర్రి ఏరియా అధికారుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక జీఎం కార్యాలయం ఎదుట మంగళవారం రెండో రోజు కూడా రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. వివిధ డిమాండ్ల సాధన కోసం అధికారులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం ఏరియా అధ్యక్షుడు ఎస్. రమేష్ మాట్లాడుతూ రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పీఆర్పీ బకాయిలను వెంటనే చెల్లించాలని, పే అప్‌గ్రేడేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఉచిత విద్యుత్, ఫీజు రీయింబర్స్‌మెంట్, అధికారుల పదోన్నతులు, బదిలీల్లో పారదర్శకత కల్పించడంతో పాటు సింగరేణికి ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. సింగరేణిని సొంత సంస్థగా భావించి రాత్రింబవళ్లు సంస్థ అభివృద్ధికి కృషి చేస్తున్న అధికారులను ఆందోళనలకు దిగే పరిస్థితి రావడం బాధాకరమని అన్నారు. నెల రోజులుగా నిరసనలు కొనసాగుతున్నప్పటికీ యాజమాన్యం, ప్రభుత్వం స్పందించకపోవడం ఆందోళనకరమన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే సంస్థ మనుగడపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని హెచ్చరించారు. డిమాండ్ల పరిష్కారంలో మరింత జాప్యం జరిగితే ఆందోళనలను ఉధృతం చేయడంతో పాటు అవసరమైతే సమ్మెకు కూడా వెనుకాడబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి బసవరాజు, ఉపాధ్యక్షుడు వర్ధన్, డాక్టర్ మధు, జాయింట్ కార్యదర్శి రవి, ట్రెజరర్ సరిత,ఎం. సంతోష్, శ్యామ్, రాజ్‌కుమార్, మహబూబ్ ఖాన్‌తో పాటు మందమర్రి ఏరియాకు చెందిన సీనియర్, జూనియర్ అధికారులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలు సద్వినియోగించుకోవాలి


### మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్



**కుత్బుల్లాపూర్, జూన్ 30 (క్రైమ్ మిర్రర్):** ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలు సద్వినియోగించుకోవాలి అని జగద్గిరిగుట్ట డివిజన్ మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. మంగళవారం మగ్దుమ్ నగర్ లోని ఆయన నివాస కార్యాలయం వద్ద (జి ఎల్ ఆర్ ఏ ఇండియా) వారి ఆధ్వర్యంలో మల్లారెడ్డి నారాయణ ఆస్పత్రి డాక్టర్ల బృందం సమక్షంలో ఉచిత పరీక్షలు, మందుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ జగన్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించిన స్వచ్ఛంద సంస్థ వారికి, మల్లారెడ్డి నారాయణ ఆసుపత్రి డాక్టర్ల బృందానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఎక్కువ శాతం నిరుపేదల నివసించే ఇలాంటి బస్తీలలో ఉచిత వైద్య శిబిరాలు, ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించడం వలన ఎంతో మందికి ఉపయోగపడుతుందని అన్నారు. అనంతరం స్వచ్ఛంద సంస్థ సభ్యులు, డాక్టర్ల బృందం మాట్లాడుతూ బిపి, షుగర్, టెస్టులతోపాటు వైరల్ ఫీవర్స్, దగ్గు జ్వరం, కీళ్ల నొప్పులు, గొంతు నొప్పి, తదితర రోగాలకు ఉచిత మందులను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి నారాయణ హాస్పిటల్ డాక్టర్స్ బృందం, డాక్టర్ సంజయ్ కుమార్, డాక్టర్ సౌజన్య. స్నేహ, శివాని నాయకులు మాజీ అధ్యక్షులు రుద్రా అశోక్, మల్లేష్ గౌడ, కొలుకుల జైహింద్, వేణు యాదవ్, పాపిరెడ్డి, సిహెచ్ దాసు, ప్రభాకర్, హనుమంతు, విట్టల్ గౌడ్, రాయి రాజేష్, సునీల్ రెడ్డి, సంపత్ రెడ్డి, జై మల్లేష్, సబిత, ఉమారాణి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.


# క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు కంటెంట్ రైటర్లు కావలెను

**సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం**



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

**9393929595**


# నూతన కమిషనర్ ను సన్మానించిన పాలకవర్గం



**పెబ్బేరు జూన్ 30 క్రైమ్ మిర్రర్ :** పెబ్బేరు మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎస్.గణేష్‌ను మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ సుమిత్రా ఎల్లారెడ్డి, కౌన్సిలర్లు జములమ్మ, శివసాయి, తాటికొండ కృష్ణ, పర్వీన్ షకీల్, భాగ్యలక్ష్మి శివ, మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ గణేష్‌ను కలిసిన పాలకవర్గం సభ్యులు ఘనంగా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. పట్టణ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నూతన కమిషనర్‌తో కలిసి సమన్వయంతో పనిచేస్తామని తెలిపారు. ముఖ్యంగా పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, రోడ్ల నిర్వహణ వంటి మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. కమిషనర్ గణేష్ మాట్లాడుతూ.. పాలకవర్గం సహకారంతో పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని, ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమ వెంచర్లు చేస్తే చర్యలు తప్పవులి : సర్పంచ్ రమాదేవి

### మునుగోడు గ్రామ పంచాయతీ



మునుగోడు క్రైమ్ మిర్రర్ జూన్ 30 : మునుగోడు గ్రామ పంచాయతీలో ఎలాంటి పర్మిషన్ లేకుండా వెంచర్లు చేస్తే చర్యలు తీసుకుంటామని సర్పంచ్ పాలకూరి రమాదేవి హెచ్చరించారు..మంగళవారం సర్పంచ్ ఒక ప్రకటనలో మాట్లాడుతూ ప్రజలు మోసపోకుండా ఉండేందుకు ప్లాట్లు కొనే ముందు సదరు వెంచర్ కు ,డిటిసిపి పర్మిషన్లు ఉన్నాయా లేదో అని చూసుకోవాలని ఆమె సూచించారు. పర్మిషన్ లేకుండా అక్రమ వెంచర్లు చేస్తూ అమ్ముతున్నారని గ్రామపంచాయతీ దృష్టికి రావడం జరిగిందన్నారు..వివరాలు అన్ని తెలుసుకున్నాకే ప్లాట్లు కొనుగోలు చేయాలని సర్పంచ్ సూచించారు..



# 18 సంవత్సరాల నుండి నా ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలి

### ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్స్యూ రివిజన్ లో పాల్గొన్న బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశ్వంత్ కుమార్

**కూకట్ పల్లి, జూన్ 30 (క్రైమ్ మిర్రర్) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం, వెంకటేశ్వర నగర్ డివిజన్ పరిధిలో జరుగుతున్న ఓటరు జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్ కార్యక్రమంలో భాగంగా, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశ్వంత్ కుమార్ మంగళవారం బి ఎల్ ఓ రాధిక తో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కొత్త ఓటర్ల నుండి ఫారం–6 స్వీకరించి, ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపుల ప్రక్రియను వేగవంతం చేయాలని బి ఎల్ ఓ కి సూచించారు. అనంతరం అశ్వంత్ కుమార్ మాట్లాడుతూ, “18 ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత శక్తివంతమైన ఆయుధం అని అన్నారు. అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించే బాధ్యత మనందరిపై ఉందని, ఎస్ ఆర్ ఐ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి” అని పిలుపునిచ్చారు. అడ్రస్ మార్పు, కరెక్షన్ల కోసం ప్రజలు ఫారం–6, 7, 8 లను తమకు అందజేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సిద్ధులు, శ్రీనివాస్, సాగర్, నరేందర్ ప్రసాద్, రమణ, భాష, బూత్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఏవీబీ పురం స్థానికుల సమస్యలను ప్రభుత్వ అధికారులు వెంటనే పరిష్కరించాలి

### జనసేన నాయకులు ముమ్మారెడ్డి ప్రేమ కుమార్



**కూకట్ పల్లి, జూన్ 30 (క్రైమ్ మిర్రర్) :** కూకట్ పల్లి నియోజకవర్గంలోని ఏవీబీ పురం వాసుల పిలుపు మేరకు నియోజక వర్గం జనసేన పార్టీ కంటెస్ట్ ఎంఎల్ఏ అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ కాలనీ వెళ్లి ప్రెసిడెంట్ సింహాద్రి, ప్రధాన కార్యదర్శి వెంకట్ రావు, స్థానికులు తో కలిసి కాలనీ లో తిరుగుతూ అక్కడ నివాసం ఉంటున్న వారు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ ఏవీబీ పురం లో మోరీలు నిత్యం పొంగుతున్నాయని, వర్షకాలం మరి ఎక్కువ సమస్యగా ఉందని, సుమారు వంద కుటుంబాలు నివాసం ఉంటున్న సెంట్ రిటా హై స్కూల్ వెనుక, రోడ్ నంబర్ - 11 లొ మంజీర, డ్రైనేజీ సౌకర్యం లేకపోవడం బాధాకరం అని, ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సంబంధిత అధికారులు స్పందించి వెంటనే సమస్యలను పరిష్కరించి నివాసులకు ఊరట నివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కొల్లా శంకర్, వేముల మహేష్, శివశంకర్ కాలనీ ఆర్. వాసు,గోవింద్, లక్ష్మీనారాయణ, బాబూరావు, భాస్కర్ రావు, తిరుపతి, ప్రసాద్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# మద్యం మత్తులో ఓ యువకుడు ఫ్యాన్ కొక్కనికి ఉరివేసుకొని ఆత్మహత్య



**బాలానగర్, జూన్ 30 (క్రైమ్ మిర్రర్) :** బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హరిజన బస్తీలో విషాదం చోటుచేసుకుంది. టేక్మాల్లా శ్రీకాంత్ (28) అనే యువకుడు మంగళవారం ఉదయం తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ నర్సింహా రాజు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. శ్రీకాంత్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ భార్య యామిని, నాలుగేళ్ల కుమారుడితో కలిసి నివాసం ఉంటున్నాడు. అతనికి మద్యం సేవించే అలవాటు ఉండటంతో తరచూ భార్య, కుటుంబ సభ్యులతో గొడవలు జరిగేవని తెలిపారు. సోమవారం రాత్రి మద్యం మత్తులో ఇంటికి వచ్చిన శ్రీకాంత్ భార్య, అత్తతో మరోసారి వాగ్వాదానికి దిగాడు. ప్రతిరోజూ మద్యం తాగి గొడవలు చేయొద్దని అత్త మందలించడంతో వివాదం మరింత పెరిగింది. దీంతో భార్య యామిని, అత్త ఆ రాత్రి పక్కింట్లో నిద్రించారు. మంగళవారం ఉదయం సుమారు 6:30 గంటలకు ఇంటికి వెళ్లి చూడగా, శ్రీకాంత్ ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. వెంటనే స్థానికుల సహాయంతో అతడిని దించి ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు బాలానగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కుటుంబ కలహాల నేపథ్యంలోనే ఈ ఘటన జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు.

# భవన నిర్మాణ సంక్షేమ బోర్డు స్కీములను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వొద్దు






### వెల్ఫేర్ బోర్డు నుండే సంక్షేమ పథకాలు కార్మికులకు అందించాలి

### సిఎస్సి సంస్థ హెల్త్ టెస్టులను వెంటనే రద్దు చేయాలి

### సహజ మరణానికి రూ.5 లక్షలకు పెంచాలి

### సీఐటీయూ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్

**కూకట్ పల్లి, జూన్ 30 (క్రైమ్ మిర్రర్) :** భవన నిర్మాణ కార్మికుల ఆధ్వర్యంలో లో కూకట్ పల్లి లో నిరసన అనంతరం కూకట్ పల్లి తహసిల్దార్ కార్యాలయం లో డిప్యూటీ తాసిల్దార్ జ్యోతి కి సీఐటీయూ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ వినతి పత్రం అందజేశారు. అనంతరం సీఐటీయూ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ మాట్లాడుతూ తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు అమలు చేస్తున్న ప్రమాద మరణం, సహజ మరణం, శాశ్వత, పాక్షిక అంగవైకల్యం ఈ మూడు స్కీములను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా అమలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం. 12ను జూలై తేది: 22-07-2025న విడుదల చేసింది. జీఓ విడుదల చేసిన వెంటనే ట్రెయిల్ బ్లైజర్ అనే బ్రోకర్స్ సంస్థ ద్వారా రూ.346 కోట్లు ప్రైవేట్ బీమా కంపెనీలకు బదిలీ చేశారు. కార్మికులకు ఎటువంటి ఉపయోగం లేని సిఎస్ సి హెల్త్ టెస్టులు చేస్తూ రూ.750 కోట్లకు పైగా ఆ సంస్థకు ఇచ్చి వెల్ఫేర్ బోర్డు సెస్సు నిధులు దుబారా చేశారు. కేంద్ర చట్టం, రాష్ట్ర వెల్ఫేర్ బోర్డు నిబంధనలను ఉల్లంఘించి అక్రమంగా ఇన్సూరెన్స్ కంపెనీలకు, సిఎస్సి సంస్థకు వందల కోట్లు కట్టబెట్టడం దుర్మార్గం అని అన్నారు. 1996 భవన నిర్మాణ కార్మికుల కేంద్ర చట్టం ప్రకారం వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని నియమించి వారి నిర్ణయం ప్రకారమే బోర్డు నిధులను ఖర్చు చేయాలి. కానీ వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని నియమించకుండా ప్రభుత్వం, కార్మిక శాఖ అధికారులు కమిషన్లకు కక్కుర్తి పడి ఎలాంటి గుర్తింపు లేని ఇన్సూరెన్స్ కంపెనీలకు స్కీములను అప్పగించి పేద నిర్మాణ కార్మికుల నోట్లో మట్టిగొడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2009 నుండి 2025 వరకు బోర్డులో నమోదు చేసుకున్న కార్మికులు 28 లక్షల 50 వేల మంది ఉండగా, 16 లక్షల మందిని మాత్రమే రెన్యువల్ చేసి ఒక్కొక్క కార్మికుడికి ప్రీమియం రూ.2,309/- ల చొప్పున 15 లక్షల మంది కార్మికులకు రూ.346.36 కోట్లు ప్రైవేట్ బీమా కంపెనీలకు అప్పనంగా కట్టబెట్టారు. 2025 జూలై 24 నుండి ఇప్పటివరకు ఇన్సూరెన్స్ కంపెనీ వారు కార్మికులకు చెల్లించిన నష్టపరిహారాలు రూ.140 కోట్లు మాత్రమే. సుమారు రూ.200 కోట్లు ఇన్సూరెన్స్ కంపెనీలకు మిగిల్చారు. బోర్డు నుండి డేటా ఇవ్వలేదని సాకు చూపి వేలాది మంది కార్మికులకు నష్టపరిహారాలు ఇవ్వకుండా ఆఫీసుల చుట్టూ తిప్పుకొని వందల కోట్లు ఇన్సూరెన్స్ కంపెనీలు దోచుకున్నాయి. 13 లక్షలకు పైగా కార్మికుల కార్డులు రెన్యువల్ చేయకుండా వారికి అన్యాయం చేస్తున్నారు. వివాహ కానుక, ప్రసూతి కానుక, హాస్పిటల్ ఖర్చులు, దహన సంస్కారాల ఖర్చుల వంటి తదితర స్కీములను ప్రభుత్వం, బోర్డు అధికారులు అనేక కారణాలు చూపి కార్మికులకు అందకుండా చేస్తున్నారు. కార్మికులకు ఇవ్వాల్సిన నష్టపరిహారాలకు నిధులు సకాలంలో విడుదల చేయకుండా, కొత్త సంక్షేమ పథకాలు పెట్టకుండా ప్రభుత్వం బోర్డు నిధులను దుబారా చేస్తున్నది. కావున ప్రభుత్వం వెంటనే ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇచ్చిన రద్దు చెయ్యాలి కార్మికుల ను ఆదుకోవాలి వారికీ ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలి, సహజ మరణ కార్మికులకు 5లక్ష లు వెల్ఫేర్ బోర్డు నుండి ఇవ్వాలి అని మాట్లాడారు. ఈ కార్యక్రమం లో భవన నిర్మాణ సంఘం, కూకట్ పల్లి మండల కార్యదర్శి బి. రాములు, సమ్మయ్య, మోహన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీలకు మాన్యం భూములు పట్టాలి ఇప్పించాలి

### పరిగి ఎమ్మెల్యేకు మేమరండం ఇచ్చిన ముజాహిద్పూర్ గ్రామ సర్పంచ్ చంద్రభూపాల్



**క్రైమ్ మిల్లర్ కుల్కచర్ల:** గత 50 సంవత్సరాల క్రిందట కాంగ్రెస్ ప్రభుత్వం అప్పటి ప్రధానమంత్రి కీర్తిశేషులు ఇందిరాగాంధీ ఎస్సీలకు ఇనాం భూములు అంటే మాన్యం భూములు ఇచ్చారు. ఆ భూములను నేటి వరకు సాగు చేసుకుని ఎస్సీ రైతులు జీవనాధారం గడుపుతున్నారు. వారికి మన్యం భూములు పట్టాలు ఇప్పించాలని ముజాహిద్ పూర్ గ్రామ సర్పంచ్ చంద్రభూపాల్ గ్రామస్తులతో కలిసి మంగళవారం పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి కి మెమరండం సమర్పించారు. ఎమ్మెల్యే గారు స్పందించి జిల్లా కలెక్టర్ గారికి ఫోన్ ద్వారా మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. వెంటనే మన్యం భూములను ఎస్సీలకు పట్టాలిపించే బాధ్యత తీసుకుంటానని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వేముల రాములు, పులింగా వెంకటేష్, టి పి సి సి సోషల్ మీడియా కన్వీనర్ పడెగల్ల భీంభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


## బిజెపి తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న పరిగి అసెంబ్లీ ఇంచార్జ్ మారుతి కిరణ్ బూనేటి



**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో బిజెపి పార్టీ పరిగి అసెంబ్లీ ఇంచార్జ్ మారుతీ కిరణ్ బూనేటి మంగళవారం ఘట్కేసర్ లో జరిగిన సమావేశంలో పాల్గొనడం జరిగింది. ఈ సమావేశం భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచంద్రారావు గారి ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథులుగా భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షులు శ్రీ నితిన్ నబిన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.అనంతరం భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షులు శ్రీ నితిన్ నబిన్ గారు, శ్రీ మారుతి కిరణ్ బూనేటి గారిని సన్మానం చేయడం జరిగింది.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడమే ధ్యేయంగా, రాష్ట్రంలోని భారతీయ జనతా పార్టీ 2028 లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని, ప్రజల్లోకి వెళ్లి పార్టీ సిద్ధాంతాలు, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజలకు చేరవేయాలని పిలుపునిచ్చారు.తెలంగాణ రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, సంస్థాగత బలోపేతం, రానున్న ఎన్నికలకు సంబంధించి పార్టీ కార్యాచరణపై సమగ్రంగా చర్చించి పలు కీలక రాజకీయ తీర్మానాలను ఆమోదించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ పరిగి నియోజకవర్గ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగంలో పదవీ విరమణ తప్పసరి

### కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు సర్పంచ్ గడ్డం వెంకటయ్య



క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: ప్రభుత్వ ఉద్యోగంలో ప్రతి ఒక్కరికి పదవి విరమణ తప్పదని కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ బిఎస్ ఆంజనేయులు, పీరంపల్లి గ్రామ సర్పంచ్ బక్కని.గడ్డం వెంకటయ్య, సూచించారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో జిల్లా వ్యవసాయ అధికారి రాజారత్నం పదవీ విరమణ అభినందన సభలో మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాజారత్నం సారు వ్యవసాయ అధికారిగా ఉన్నన్ని రోజులు రైతులకు ఎన్నో సేవలు చేశారని, రైతుల యొక్క క్షేమం గురించి ఆలోచన చేసేది వ్యక్తి అని, వ్యవసాయంలో రైతులు అధిక దిగుబడులు సాధించే విధంగా వారు లాభాలు పొందే విధంగా పలు సూచనలు సలహాలు అందించారని వారి పేర్కొన్నారు. వారు చేసిన సేవలు ఈ జిల్లాలోని రైతులు మరువలేరని వారు ఎక్కడ ఉన్నా కానీ దేవుడు వారికి మంచి ఆరోగ్యం ఇవ్వాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముజాహిద్పూర్ గ్రామ వార్డు సభ్యులు బోయిని కృష్ణయ్య, వంశీధర్ రెడ్డి రాజరత్నం కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్



**గండిపేట(క్రైం మిర్రర్):** పేద ప్రజల సంక్షేమానికి రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీత వేస్తుందని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. మైలార్‌దేవ్‌పల్లిలోని తన నివాసంలో మంగళవారం లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. రాజేంద్రనగర్, అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్లకు చెందిన పలువురు బాధిత కుటుంబాలకు ఈ చెక్కులను ఆయన స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఆపదలో ఉండి ప్రైవేట్ ఆసుపత్రులలో ఖరీదైన వైద్యం చేయించుకున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఆసరాగా నిలుస్తుందన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న ప్రతి నిరుపేద కుటుంబానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ధనుంజయ, టీ.ప్రేమ్ గౌడ్, బాస శ్రీనివాస్ నేత, కళ్లెం లక్ష్మారెడ్డి, శ్రవణ్, సాయి మాలిక్, శరణమ్మ, స్థానిక నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కిస్మత్‌పూర్‌లో చోరీ.. బంగారం, నగదు అపహరణ



**గండిపేట(క్రైం మిర్రర్):** రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్ వివేకానంద కాలనీలో చోరీ జరిగింది. బాధితుడు జె. సుబ్బరామి రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి నిర్మాణ పనుల కోసం అనంతపురానికి వెళ్లగా, ఈ నెల 27న తెల్లవారుజామున తిరిగి వచ్చి చూడగా ఇంటి ప్రధాన తలుపు తాళం పగులగొట్టి ఉన్నట్లు గుర్తించారు. ఇంట్లోని బెడ్‌రూమ్‌లో ఉన్న ఇనుప అల్మారాను ధ్వంసం చేసి, అందులో ఉన్న సుమారు 3 తులాల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, రూ.20 వేల నగదు, హాల్‌లో ఉన్న జూట్ బ్యాగ్‌లోని రూ.2 వేల చిల్లర నగదు, ఒక మొబైల్ ను గుర్తుతెలియని దుండగులు అపహరించినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న రాజేంద్రనగర్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



## ప్రతి ఒక్కరూ ఓటర్ జాబితాలో పేర్లను నమోదు చేసుకోవాలి

### ఒకే ప్రాంతంలో ఓటు ఉండేలా చూసుకోవాలి

### మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు వార్డ్ మెంబర్ మోత్కూర్ వెంకటేష్



**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:** 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో పేర్లను నమోదు చేసుకోవాలని అలాగే తెలంగాణ రాష్ట్రంలో ఒకే ప్రాంతంలో ఓటు ఉండేలా చూసుకోవాలని కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ బిఎస్ ఆంజనేయులు, కుల్కచర్ల గ్రామపంచాయతీ వార్డ్ మెంబర్ మోత్కూర్ వెంకటేష్ ఓటర్లకు సూచించారు. వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలంలోని ముజాహిద్పూర్ అలాగే కుల్కచర్ల మండల కేంద్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా బూతులు అధికారులతో కలిసి ఓటరు జాబితా సవరణ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగం ఇచ్చిన ఓటు హక్కు ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని, తెలంగాణ రాష్ట్రంలో ఒకే దగ్గర ఓటు ఉండేటట్లుగా చూసుకోవాలని, గ్రామాలలో అన్ని బూతులకు ఓటు సవరణ పత్రాలు అందేటట్లుగా బిఎల్ఓలు చొరవ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఓలు పంచాయతీ కార్యదర్శి సంతోష్ కుమార్, బిఎల్ఏలు పడెగల్ల యాదయ్య, వార్డు సభ్యులు బోయిని కృష్ణయ్య, కుల్కచర్ల గ్రామ 138 139వ బూతు లెవెల్ ఆఫీసర్ మాలే స్వరూప, జయమ్మ, లొద్ద భారతమ్మ దొడ్డ సత్యమ్మ పీ.కిష్టయ్య, సి మహేశ్వరి మంగమ్మ బుచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం లాంటిది

### డిసిసి ఉపాధ్యక్షులు భీంరెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గోపాల్ నాయక్

క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు ఒక వరం లాంటిదని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బొలుసని భీంరెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గోపాల్ నాయక్ సూచించారు. వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలంలోని చెరువు ముందలి తాండ పన్నమ్మకు 30000 రూపాయల చెక్కును సోమవారం నాయకులతో కలిసి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్ ఆసుపత్రిలో వైద్యం తీసుకున్న ప్రతి పేదవారు ముఖ్య మంత్రి సహాయ నిధిని ఉపయోగించుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో రాంపూర్ గ్రామం సర్పంచ్ చెక్కల తిరుపతయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గండి లక్ష్మయ్య, యువ నాయకులు పక్కనే వెంకటయ్య, చరిముందలి తాండ యువకులు తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ పోలీస్ అకాడమీలో డేటా అనలిటిక్స్ అండ్ ప్రొఫైలింగ్ యూజింగ్ ఓపెన్ సోర్స్ టూల్స్ కోర్సు ముగింపు సమావేశం



**గండిపేట(క్రైం మిర్రర్):** ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో నేషనల్ క్రై మ్ రికార్డ్స్ బ్యూరో(ఎన్‌సిఆర్‌బి) స్పాన్సర్‌తో నిర్వహించిన రెండు రోజుల డాటా అనలిటిక్స్ అండ్ ప్రొఫైలింగ్ యూజింగ్ ఓపెన్ సోర్స్ టూల్స్ శిక్షణా కార్యక్రమం మంగళవారం విజయవంతంగా ముగిసింది. రెండురోజుల ఈ కోర్సులోల తెలంగాణ రాష్ట్రంతో పాటు ఒడిశా, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన మొత్తం 33 మంది పోలీసు అధికారులు పాల్గొన్నారు. కోర్సు ముగింపు కార్యక్రమానికి అకాడమీ డిప్యూటీ డైరెక్టర్(ఇన్--సర్వీసెస్) జి.కవిత ముఖ్యఅతిథిగా హాజరైయ్యారు. మాట్లాడుతూ నేటి కాలంలో సైబర్ నేరాలు, సాంకేతిక ఆధారిత నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో పోలీసు అధికారులు ఓపెన్ సోర్స్ టూల్స్ డేటా అనలిటిక్స్ డేటా ప్రొఫైలింగ్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్ధవంతంగా వినియోగించి శాస్త్రీయ దర్యాప్తు చేపట్టాలని సూచించారు. కానిస్టేబుల్ స్థాయి నుంచి ఇన్‌స్పెక్టర్ స్థాయి వరకు ప్రతి పోలీసు అధికారి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని నేరాల ఛేదనలో సమర్ధవంతంగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఎన్‌సీఆర్‌బీ తెలంగాణ పోలీస్ అకాడమీని సౌత్ జోనల్ సెంటర్‌గా గుర్తించి ఈ శిక్షణా కార్యక్రమాలను నిర్వహించడం అకాడమీకి లభించిన ప్రత్యేక గుర్తింపు అని పేర్కొన్నారు. ఈ కోర్సులో ఒడిశా రాష్టానికి చెందిన ఒక ఇన్‌స్పెక్టర్, తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఒక సబ్ ఇన్‌స్పెక్టర్ పాల్గొనడం ఈ శిక్షణా కార్యక్రమానికి ఉన్న జాతీయ స్థాయి ప్రధాన్యతను ప్రతిబింబిస్తుందన్నారు. అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్ చొరవతో ప్రతి నెల ఇన్--సర్వీస్ పోలీసు అధికారుల కోసం జాతీయ స్థాయి ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తూ, పోలీసు శాఖలో ఆధునిక దర్యాప్తు నైపుణ్యాలను పెంపొందించేందుకు అకాడమీ కషి చేస్తుందన్నారు. ఈ శిఅక్షణ కార్యక్రమానికి డీఎస్పీ, కోర్సు డైరెక్టర్‌గా ఆదూరి శ్రీనివాస్, కోర్సు కోఆర్డినేటర్‌గా, ప్రోగ్రామర్‌గా పి.శ్రీనివాస్ వ్యవహరించి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారన్నారు.

# తెలంగాణ పోలీస్ అకాడమీలో ఇద్దరి పదవీ విరమణ వీడ్కోలు సన్మాన కార్యక్రమం





**గండిపేట(క్రైం మిర్రర్):** ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో మంగళవారం పదవీ విరణ ఒపందిన ఇద్దరు ఉద్యోగులకు ఘనంగా వీడ్కోలు, సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్(పిటివో)లో సబ్ ఇన్‌స్పెక్టర్(డ్రై వర్)గా సేవలందించిన జి.బాలరాజు, అకాడమీ రీప్రొగ్రఫీ(ప్రిం టింగ్ ప్రెస్) విభాగంఓ ఆఫ్సెట్ మెషీన్ ఆపరేటర్‌గా సేవలందించిన టి.ఎల్లయ్యలకు అకాడమీలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్ ముఖ్యఅతిథిగా హాజరైయ్యారు. ఆమె మాట్లాడుతూ జి.బాలరాజు సుమారు 43 సంవత్సరాల పాటు పోలీస్ శాఖలో అత్యంత నిబద్ధత, క్రమ శిక్షణతో విధులు నిర్వహించారని కొనియాడారు. సబ్ ఇన్‌స్పెక్టర్(డ్రై వర్)గా ఉన్నతాధికార ులను ప్రతి రోజూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంలో ఆయన చూపిన బాధ్యతాయుత సేవలు ఆదర్శప్రాయమని ప్రశంసిం చారు. అలాగే టి.ఎల్లయ్య రీప్రోగ్రఫీ విభాగంలో సుమారు 33 సంవత్సరాల పాటు అత్యంత క్రమ శిక్షణతో సేవలందించారని పేర్కొన్నారు. పదవీ విరమణ రోజున కూడా శిక్షణార్థుల పరీక్షల నిర్వహణకు సంబంధించిన విధులు నిర్వర్తించడం ఆయన విధి పట్ల ఉన్న అంకితభావానికి నిదర్శనమని అభినందించారు. మోటర్ ట్రాన్స్‌ఫోర్ట్, రీప్రోగ్రఫీ(ప్రింటింగ్ ప్రెస్) విభాగాలో పని చేస్తూ శిక్షణా కార్యక్రమాలకు అవసరమైన గెస్ట్ ఫ్యాకల్టీ రవాణా, శిక్షణార్థుల పరీక్షల ప్రశ్న పత్రాల ముద్రణలో అత్యంత గోప్యతను కాపాడడం వంటి కీలక బాధ్యతలను ఇద్దరూ సమర్ధవంతంగా నిర్వహించి అకాడమీ ప్రతిష్టను మరింత పెంచారని డైరెక్టర్ పేర్కొన్నారు. పదవీ విరమణ పొందిన వారిని శాలువాలతో ఘనంగా సన్మానించి, జ్ఞాపికలు, కానుకలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్లు వెంకటేశ్వర్లు, కె.ఆర్.కె.ప్రసాద్, శ్రీరామమూర్తి, అసిస్టెంట్ డైరెక్టర్ వేముల శ్రీనివాసరావు, డీఎస్పీలు జ్ఞానేశ్వర్‌రెడ్డి, రామారావు, తోట శ్రీనివాసులు, ఇండోర్, ఔట్‌డోర్ ఫ్యాకల్టీ సభ్యులు, అకాడమీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కబీర్ కోహినూర్ సమ్మాన్ అవార్డు అందుకున్న విద్యాసాగర్ జామి ప్రసాదరావు

**మందమర్రి టౌన్ జూన్ 30 క్రైమ్ మిర్రర్:** రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన అఖిల్ భారతీయ కబీర్ మఠం, సద్గురు కబీర్ ఆశ్రమ్ సేవా సంస్థాన్ ఆధ్వర్యంలో ఆదివారం,సోమవారం ఘనంగా నిర్వహించిన 629వ కబీర్ జయంతి మహోత్సవాల్లో భాగంగా మందమర్రి సింగరేణి ఉన్నత పాఠశాలలో సీనియర్ హిందీ పండితులుగా విధులు నిర్వహిస్తున్న విద్యాసాగర్ జామి ప్రసాదరావు ప్రతిష్టాత్మక జాతీయ పురస్కారం కబీర్ కోహినూర్ సమ్మాన్ అందుకున్నారని తెలిపారు.ఈ వేడుకల్లో హిందీ భాషా, సాహిత్య రంగాలకు విశేష సేవలు అందించినందుకు గాను వారికి ఈ జాతీయ పురస్కారానికి ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.ఇది ఆయన అందుకున్న ఐదవ జాతీయ స్థాయి పురస్కారం కావడం విశేషం అని అన్నారు.అదేవిధంగా కబీర్ మహోత్సవ కార్యక్రమంలో విద్యా, సామాజిక అభివృద్ధికి దోహదపడేలా విద్యాసాగర్ జామి ప్రసాదరావు సంపాదకత్వంలో వెలువడిన పలు గ్రంథాలను ఆవిష్కరించారని తెలిపారు. ఈ సందర్భంగా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి హాజరైన విద్యావేత్తలు, సాహితీవేత్తలు, కవులు ఆయనను అభినందించి శుభాకాంక్షలు తెలిపారని అన్నారు.ఈ



అవార్డు అందుకోవడం పట్ల విద్యాసాగర్ జామి ప్రసాదరావు ఆనందం వ్యక్తం చేస్తూ, హిందీ భాషా సాహిత్య సేవలో మరింత అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు.

# ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

## బీజేపీ సీనియర్ నాయకులు అడికె మహేందర్



**గండిపేట(క్రైం మిర్రర్):** మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని బూత్ నెంబర్ 434, 435, 436లలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా బీఎల్‌ఓలు, బీఎల్‌ఏలు కలిసి ఓటర్లకు ఫారాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ రంగారెడ్డి జిల్లా సీనియర్ నాయకులు అడికె మహేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అడికె మహేందర్ మాట్లాడుతూ.. ప్రతి ఓటరు తమకు కేటాయించిన ఫారాలను సరైన రీతిలో పూర్తి చేసి, తమ ఓటు హక్కును భద్రపరుచుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితాలో ఏవైనా తప్పులు, దొర్లిన సవరణలు ఉంటే సరిచేసుకోవడానికి ఇదొక సువర్ణ అవకాశమని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత కీలకమైనదని, దేశంలో ఎక్కడైనా సరే ఒకే ఓటు ఉండేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఎలాంటి తప్పుడు సమాచారం ఇవ్వకుండా, నిజమైన ఓటర్లుగా నమోదు చేయించుకోవాలని స్పష్టం చేశారు. నూతనంగా 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఈ ఫారాల ద్వారా తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. మొదటిసారి ఓటు హక్కు పొందుతున్న యువత ఉత్సాహంగా ముందుకు వచ్చి ప్రజాస్వామ్య నిర్మాణంలో భాగస్వాములు కావాలని మహేందర్ గారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక బూత్ స్థాయి అధికారులు, పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# గిరిజన సమస్యల పరిష్కారానికి యువత ముందుకు రావాలి

## రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలకు సిద్ధమవుతున్న గిరిజన సంఘం

## నల్గొండ జిల్లా నాయకులు నాగేశ్వరరావు, ఎర్రనాయక్ పిలుపు




**మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, జూన్ 30:** రాష్ట్రవ్యాప్తంగా గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి గిరిజన యువత, విద్యార్థులు ముందుకు రావాలని తెలంగాణ గిరిజన సంఘం నల్గొండ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఎర్రనాయక్ పిలుపునిచ్చారు.మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. గిరిజనులు భూ హక్కులు, అటవీ హక్కులు, విద్య, వైద్యం, ఉపాధి, తాగునీరు, రహదారులు, సంక్షేమ పథకాల అమలు వంటి అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. వీటికి శాశ్వత పరిష్కారం కోసం తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్రవ్యాప్తంగా ప్రజా ఉద్యమాలు, ధర్నాలు, వినతిపత్రాల సమర్పణ, ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.గిరిజనుల రాజ్యాంగబద్ధ హక్కుల పరిరక్షణ, న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టే ఉద్యమాలకు గిరిజన సంఘాలు, ప్రజాసంఘాలు, ప్రజాస్వామ్యవాదులు, మేధావులు, యువత, మహిళలు, ప్రజలందరూ అండగా నిలవాలని కోరారు. గిరిజన అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ ఉద్యమంలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.సమావేశంలో ఎం. రవినాయక్, బాబునాయక్, దేశరామనాయక్, హనుమంతునాయక్, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.



# బాబుల్ రెడ్డి నగర్‌లో ఇంటింటికీ ఓటర్ల సవరణ ఫారాల పంపిణీ



**గండిపేట(క్రైం మిర్రర్):** కాటేదాన్ డివిజన్ పరిధిలోని బాబుల్ రెడ్డి నగర్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. ఇందులో భాగంగా మంగళవారం మాజీ వార్డ్ మెంబర్ సోమ శ్రీనివాస్ గుప్తా, బూత్ స్థాయి అధికారి నాగమణితో కలిసి స్థానికంగా ఇంటింటికీ తిరిగి ఓటర్ల సవరణ ఫారాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, జాబితాలో ఏవైనా తప్పులు ఉంటే సరిచేసుకోవడానికి ఈ ఫారాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నూతనంగా 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు తప్పకుండా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత కీలకమైన ఆయుధమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు హక్కును పొందాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు శ్రీనివాస్ రెడ్డి, సురేష్, జగన్, సోమ సందీప్ గుప్తా, రవి మరియు కాలనీవాసులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# నిషేధిత జర్దా తయారీ కేంద్రంపై మైలార్‌దేవ్‌పల్లి పోలీసుల దాడి



**గండిపేట(క్రైం మిర్రర్):** నిషేధిత జర్దాను తయారు చేస్తున్న గోదామ్‌పై మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు మంగళవారం దాడి చేశారు. ఒకరిని అరెస్ట్ చేయగా మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం బేగం బజార్‌కు చెందిన సయ్యద్ జమీల్, జిత్తూమిశ్రాలు కాటేదాన్ గణేష్‌నగర్ ప్రాంతంలో నిషేధిత జర్దా, తంబాకు తయారి గోదామ్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో సూపర్‌వైజర్‌గా శివరాంపల్లి ప్రాంతానికి చెందిన తను రామ్(36) పని చేస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు మంగళవారం దాడి చేసి తనురామ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఎలాంటి అనుతులు లేకుండా చిన్న చిన్న ప్యాకెట్స్‌లో జర్దా నింపి నగరంలోని వివిధ షాప్‌లకు, పాన్ షాప్‌లకు అమ్ముతున్నారన్నారు. వారి వద్ద నుంచి 20 కిలోల తంబాకు(జర్దా), అనార్ పేరు మీద పేపర్ పెద్ద రోల్స్, 110 డ్రమ్మలల్లో తంబాకు, తంబాకు తయారు చేసే రెండు మిషన్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితులు ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# మహా సైకిల్ యాత్ర కొనసాగిస్తున్న స్వాములను సన్మానించిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రమేష్‌ముదిరాజ్



**గండిపేట(క్రైం మిర్రర్):** సువర్ణభూమి ట్రస్ట్ ఆధ్వర్యంలో వినయ్ గురుస్వామి, వసంత్‌గురుస్వామిల ఆధ్వర్యంలో మహాపాదయాత్ర ఘనంగా కొనసాగుతుంది. ప్రతి ఏటా బాన్సువాడ నుంచి కేరళలోని శబరిమల అయ్యప్ప స్వామిని దర్శించుకోవడానికి వందల మంది మహాపాదయాత్ర నిర్వహిస్తుంటారు. ఈ ఏటా 26వ తేదీన బాన్సువాడ నుంచి తిరుమల తిరుపతిలోని వైకుంఠ వాసుని తిరుమల వెంకటేశ్వర స్వామిని దర్శించుకోవడానికి 55 మంది భక్తులతో మహా సైకిల్ యాత్రను ప్రారంభించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రమేష్‌ముదిరాజ్ వారిని రాజేంద్రనగర్ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ నుంచి తిరుపతికి వెళ్తుండగా మార్గం మధ్యలో కాటేదాన్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌కు సంబంధించిన నాయకులు కలిసి అభినందించారు. ఈ కార్యక్రమంలో నర్సిరెడ్డిస్వామి, మల్లేష్‌స్వామి, అశోక్‌కుమార్‌స్వామి, రమేష్‌రెడ్డి స్వామి, బాబురావుస్వామి, సత్యరెడ్డిస్వామి, శివకుమార్ స్వామి, కట్ట స్వామి, వీరన్నస్వామి తదితరులున్నారు.

# నార్సింగిలో ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రారంభించిన ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్

**గండిపేట(క్రైం మిర్రర్)** నార్సింగి సర్కిల్-45 పరిధిలో ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళా సంఘాల సభ్యులు, అర్హులైన మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూప్రజా పాలనలో ప్రజల అభిష్ట మేరకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. రాజేంద్రనగర్ పరిధిలో మూసీ ప్రక్షాళనలో భాగంగా గండిపేట్ నుంచి బాపుఘట్ వరకు తొలి దశలో చేపట్టనున్న పనులు పూర్తయితే పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజలకు మెరుగైన వసతులు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. నార్సింగి డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని అన్ని గ్రామాల్లో సుమారు 14 వేల ఇందిరమ్మ చీరలను అర్హులైన మహిళలకు పంపిఆణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలలో తెలంగాణ ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, నార్సింగి



మార్కెట్ కమిటీ చైర్మన్ వేణుగౌడ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్, నార్సింగి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దశరథ్‌యాదవ్, స్వాతిరెడ్డి, యూసీడీ ఏఎంసీ లక్ష్మీకాంత్‌రెడ్డి, మేప్మా ఇన్‌చార్జీ రాజేశ్వరి, మాజీ సర్పంచ్ నరసింహా, శ్రీనివాస్ అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




## బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్ట్

### మరో ఇద్దరు పరారీలో ఐదు బైక్‌లను స్వాధీనం చేసుకున్న అత్తాపూర్ పోలీసులు

**గండిపేట(క్రైం మిర్రర్):** బైక్ దొంగతనాలు, వ్యవస్తీకృత నేరాలకు పాల్పడుతున్న ఇద్దరు పాత నేరస్తులను అత్తాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల వద్ద నుంచి ఐదు ద్విచక్ర వాహనాలను స్వాదీనం చేసుకున్నారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని తెలిపారు. ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీన కాటేదాన్ ప్రాంతానికి చెందిన కె.నర్సింహ్మా తన రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనాన్ని శివరాంపల్లి పిల్లర్ నెంబర్ 295 సమీపంలో పార్కు చేయగా దానిని దొంగతనం జరిగిందని గుర్తించి అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా పూల్‌బాగ్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ షానవాజ్(18), శాలిబండకు చెందిన మహమ్మద్ మోయిజ్ మోహియుద్దీన్(18)లు, శాస్త్రీపురంకు చెందిన నూర్, ఫర్హాన్‌లు దొంగతనం చేసినట్లు గుర్తించారు. వీరు జల్లాలకు, చెడు వ్యసనాలకు అలవాటుపడి, విలాసవంతమైన జీవితం గడపడానికి, బైక్‌లపై తిరగడానికి మోటర్ సైకిళ్ల దొంగతనాలు ప్రారంభించారు. స్వాధీనం చేసుకున్న వాహనాలు రాయల్ ఎన్‌ఫీల్డ్ హిమాలన్ బైక్(టిఎస్07కేబి4061), సుజుకి బర్గ్‌మన్ స్ట్రీట్ బైక్(టిఎస్12ఈవై7776), హోండా యాక్టివా(ఏపి11ఏఆర్5865), హుండా యాక్టివా(టిఎస్12ఈటి7301), సుజుకి బర్గ్‌మన్ స్ట్రీట్ బైక్(టిఎస్12ఈజెడ్7836)లనుస్థానం చేసుకున్నారు. వీరు గతంలో పలు పోలీస్‌స్టేషన్‌లలో జరిగిన కేసుల్లో నిందితులుగా ఉన్నారన్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అంకితభావ సేవలకు ఘన గుర్తింపు.. ఇద్దరు ఉద్యోగినుల పదవీ విరమణ



**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** రాజేంద్రనగర్‌లోని వాలంటరీ విభాగంలో 32 సంవత్సరాల పాటు విశిష్ట సేవలందించిన ఉమెన్ మజ్దూర్ ఉద్యోగినులు రాణి, యశోదల పదవీ విరమణ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యాలయ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో వాలంటరీ డీజీ అనితతో పాటు అధికారులు, తోటి సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీ అనిత మాట్లాడుతూ, రాణి, యశోద విధి నిర్వహణలో అంకితభావంతో, క్రమశిక్షణతో పనిచేస్తూ కార్యాలయానికి మంచి పేరు తీసుకొచ్చారని కొనియాడారు. ఉన్నతాధికారులు, సహోద్యోగులతో సత్సంబంధాలు కొనసాగిస్తూ ఆదర్శ ఉద్యోగినులుగా నిలిచారని పేర్కొన్నారు. వారి 32 ఏళ్ల సేవలను స్మరించుకుంటూ అధికారులు, సహచర ఉద్యోగులు ఘనంగా సన్మానించి, శాలువాలు కప్పి జ్ఞాపికలు అందజేసి ఆప్యాయంగా వీడ్కోలు పలికారు.

## మద్యానికి బానిసై ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య.. కేసు నమోదు




**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** మైలర్ దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసుల వివరాల ప్రకారం, బి. కిషన్ (36), రతన్ సింగ్ కుమారుడు, పింక్ క్వార్టర్స్, బ్లాక్-2, ప్లాట్ నెం.15లో నివాసం ఉంటున్నాడు. మంగళవారం సాయంత్రం సుమారు 7 గంటల సమయంలో తన ఇంట్లో ఉరివేసుకుని మృతిచెందినట్లు సమాచారం అందింది. ప్రాథమిక విచారణలో మృతుడు 2009లో వివాహం చేసుకున్నాడని, దంపతులకు సంతానం లేదని తెలిసింది. అతడు మద్యానికి బానిసై ఉండటంతో పాటు మానసిక ఆరోగ్య సంబంధిత సమస్యలతో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



## డబుల్ బెడ్‌రూమ్ గృహాల కేటాయింపు, మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలి

### ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డికి బీజేపీ నాయకుడు జల్ల జనార్ధన్

**కోదాడ, జూన్ 30 క్రైమ్ మిర్రర్ :** కోదాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గౌరవ ఎమ్మెల్యే శ్రీమతి నలమాద ఉత్తమ్ పద్మావతి రెడ్డిని బీజేపీ నాయకుడు జల్ల జనార్ధన్ డబుల్ బెడ్‌రూమ్ గృహాల కేటాయింపు, కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరిస్తూ వినతిపత్రాన్ని అందజేశారు.వినతిపత్రంలో అర్హులైన నిరుపేద కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పారదర్శకంగా కేటాయించాలని, ఇప్పటికే నిర్మించిన గృహాల పంపిణీని వేగవంతం చేయాలని కోరారు. అలాగే తాగునీరు, అంతర్గత రహదారులు, డ్రైనేజీ, విద్యుత్, వీధి దీపాలు వంటి మౌలిక వసతులను కల్పించి ప్రజలకు మెరుగైన జీవన సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, పెండింగ్‌లో ఉన్న గృహాల కేటాయింపు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని నాయకులు ఎమ్మెల్యేను కోరారు. ప్రజల సంక్షేమమే తమ లక్ష్యమని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా బీజేపీ పార్టీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ జిల్లా జనార్ధన్ రావు, వాంకుడోత్ రమేష్ నాయక్, బాదావత్ రమేష్ నాయక్, యాద నవీన్, సంధ్యా రాణి, శాంతా, సైదా, అన్నపూర్ణతో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## హెచ్‌ఎండీఏ మొకిలా ఈ-వేలానికి అపూర్వ స్పందన.. చదరపు గజానికి 1.09 లక్షల గరిష్ఠ బిడ్

### 100 ప్లాట్లు పూర్తిగా విక్రయం

### 231.65 కోట్ల ఆదాయం.. పెట్టుబడిదారుల నుంచి భారీ పోటీ

**హైదరాబాద్ : ( క్రైమ్ మిర్రర్):** హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) మొకిలా లేఅవుట్‌లో నిర్వహించిన మూడో దశ ఈ-వేలానికి గృహ కొనుగోలుదారులు, పెట్టుబడిదారుల నుంచి అపూర్వ స్పందన లభించింది. వేలానికి ఉంచిన 100 నివాస ప్లాట్లు పూర్తిగా విక్రయమవగా, గరిష్ఠంగా చదరపు గజానికి ?1,09,500 బిడ్ నమోదైంది. సగటు బిడ్ ధర చదరపు గజానికి ?75,640గా నమోదు కావడంతో హెచ్‌ఎండీఏకు సుమారు ?231.65 కోట్ల ఆదాయం సమకూరింది. హైదరాబాద్ నగరం, పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో బిడ్డర్లు ఈ-వేలంలో పాల్గొన్నారు. హెచ్‌ఎండీఏ అభివృద్ధి చేసిన లేఅవుట్లపై ప్రజల్లో ఉన్న విశ్వాసం, ప్రణాళికాబద్ధమైన నివాస ప్రాజెక్టులపై పెరుగుతున్న డిమాండ్ ఈ వేలం ద్వారా మరోసారి స్పష్టమైంది. వేలం సందర్భంగా అనేక ప్లాట్లకు పలువురు బిడ్డర్లు పోటీ పడటంతో తీవ్ర పోటీ నెలకొంది. ఈ విజయవంతమైన ఈ-వేలం ఫలితంగా హైదరాబాద్ పశ్చిమ అభివృద్ధి కారిడార్‌లో రియల్ ఎస్టేట్ పెట్టుబడులు, మౌలిక సదుపాయాల అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని హెచ్‌ఎండీఏ అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఉడంగడ్డ జీహెచ్‌ఎంసీ మైదానంలో ఐదు నెలల చిన్నారి మృతదేహం కలకలం



**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని ఉడంగడ్డ జీహెచ్‌ఎంసీ మైదానంలో సుమారు ఐదు నెలల వయస్సు గల ఆడ శిశువు మృతదేహం లభ్యమవడంతో స్థానికంగా కలకలం రేగింది.మంగళవారం సాయంత్రం సుమారు 7:30 గంటలకు పోలీసులకు 100కు సమాచారం అందడంతో వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని శిశువు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. శిశువు మృతికి గల కారణాలు, మృతదేహాన్ని అక్కడ ఎవరు వదిలివెళ్లారనే కోణంలో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

## ట్రాఫిక్ నిబంధనాలను పాటించండి ప్రాణాలను కాపాడుకోండి.....!

### ట్రాఫిక్ సి ఐ ఆధ్వర్యంలో తుక్కుగూడ శ్లోక పాఠశాలలో అవగాహన సదస్సు

### డ్రాక్స్ మాదకద్రవ్యలకు విద్యార్థులు దూరంగా ఉండాలి

### ట్రాఫిక్ సి ఐ ప్రమోద్ కుమార్




**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** శంషాబాద్ జోన్ తుక్కుగూడ సర్కిల్ లో ఉన్న శ్లోక పాఠశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నియమ నిబంధనలు మరియు మాదక ద్రవ్యాల పై విద్యార్థులకు అవగాహన కల్పించిన శంషాబాద్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ప్రమోద్ కుమార్ ఈ సందర్భంగా మాట్లాడుతూ.... విద్యార్థులు డ్రగ్స్ మరియు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు..18 సంవత్సరాలు నిండని బాలబాలికలు, ద్విచక్ర వాహనాలు నడపరాదని, ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని తెలిపారు... విద్యార్థులు చదువు పట్ల ఏకాగ్రత వహించి విద్యని అభ్యసించాలన్నారు, విద్యార్థులు తల్లి తండ్రి గురువు చెప్పిన మాటలను వింటూ... సక్రమ బాటలో నడిచి ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు, మేజర్ అయిన విద్యార్థులు ట్రాఫిక్ నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు ముఖ్యంగా హెల్మెట్,సీటు బెల్ట్, రోడ్ క్రాసింగ్,ఓవర్ టెక్ చేసేటప్పుడు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ ప్రయాణం సాగించాలన్నారు.ముఖ్యంగా మైనర్ విద్యార్థులు వాహనాలు నడపరాదని హెచ్చరించారు.ఒక వేళ మైనర్ బాలులు వాహనాలు నడిపి ఏదైనా ప్రమాదం చేస్తే పూర్తి బాధ్యత తల్లిదండ్రులే వహించాలన్నారు.పిల్లలపై తల్లిదండ్రులు నిఘా పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ జీ ఐ ఏ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ప్రమోద్ కుమార్,ట్రాఫిక్ పోలీసులు,శ్లోక పాఠశాల ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

## యూరియాకు కొరత లేదు

### మార్క్‌ఫెడ్ గోదాంలో 20 వేల మెట్రిక్ టన్నుల నిల్వలు

### యాప్‌లో బుక్ చేసుకోవాలని రైతులకు డీఏఓ సూచన

**మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్,జూన్ 30:** జిల్లాలో రైతుల అవసరాలకు సరిపడా యూరియా, ఇతర ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని నల్లగొండ జిల్లా వ్యవసాయ అధికారి వల్లోజు వినోద్‌కుమార్ తెలిపారు. మంగళవారం మిర్యాలగూడ రైల్వే స్టేషన్ రేక్ పాయింట్, మార్క్‌ఫెడ్ బఫర్ స్టాక్ గోదాంను సందర్శించి యూరియా నిల్వలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్క్‌ఫెడ్ బఫర్ స్టాక్ గోదాంలో సుమారు 20 వేల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉందన్నారు. జిల్లాలో రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వ్యవసాయ అవసరాలకు అనుగుణంగా యూరియా సరఫరా నిరంతరం కొనసాగుతుందని పేర్కొన్నారు.యూరియా యాప్ వినియోగంపై రైతులతో చర్చించిన డీఏఓ, ఎరువుల కోసం ముందుగానే యాప్‌లో బుకింగ్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో



మిర్యాలగూడ వ్యవసాయ సహాయ సంచాలకులు జగదీశ్వర్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి మేకల బుష్యేంద్రమణి పాల్గొన్నారు.

# వరంగల్‌లో 'బంగారు' భూమి..

**పసిడి కోసం పొలానికి క్యూ కడుతున్న జనం!**

**వరంగల్ జిల్లాలో ఓ పొలంలో బయటపడ్డ పురాతన బంగారు ఆభరణాలు**

**పత్తి చేనులో కలుపు తీస్తుండగా మహిళా కూలీలకు లభ్యం**

**గతంలోనూ నిధులు దొరకడంతో భూమికి భారీగా పెరిగిన డిమాండ్**

**బంగారం కోసం పొలంలో రాత్రిపూట జనాల గాలింపు**

**నిధి తమదేనంటూ పాత యజమాని కుమారుడి ఫిర్యాదుతో కొత్త వివాదం**



సాధారణంగా పంటలు పండే భూమికి గిరాకీ ఉంటుంది. కానీ, వరంగల్ జిల్లాలో ఓ ఆరెకరాల భూమికి మాత్రం పంటలతో సంబంధం లేకుండా విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఆ భూమిని కౌలుకు తీసుకుంటే రాత్రికి రాత్రే కోటీశ్వరులు కావచ్చనే ప్రచారంతో స్థానిక రైతులు దాని కోసం పోటీ పడుతున్నారు. ఇటీవల పొలంలో పురాతన బంగారు ఆభరణాలు బయటపడటంతో ఈ భూమి మరోసారి వార్తల్లో నిలిచింది. దీంతో నిధుల కోసం జనం ఎగబడటం, హక్కుల కోసం పాత, కొత్త యజమానుల మధ్య వివాదం మొదలవ్వడంతో ఈ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. చెన్నారావుపేట మండలం కోపాకులపాడు గ్రామంలోని ఈ ఆరెకరాల భూమిని పదేళ్ల క్రితం చెన్నారావుపేటకు చెందిన ఓ వ్యక్తి కొనుగోలు చేశారు. ప్రస్తుతం ఈర్యతండాకు చెందిన రైతు ఒకరు కౌలుకు తీసుకుని పత్తి సాగు చేస్తున్నారు. జూన్ 24న వర్షాలు పడటంతో చేనులో కలుపు తీసేందుకు మహిళా కూలీలు పనికి వెళ్లారు. పని చేస్తుండగా, వారికి మట్టిలో నుంచి కొన్ని పురాతన బంగారు ఆభరణాలు లభించాయి. మొదట ఈ విషయాన్ని రహస్యంగా ఉంచాలని ప్రయత్నించినా, ఊరంతా తెలియడంతో భూమి యజమాని దృష్టికి వెళ్లింది. ఆయన కూలీలను విచారించగా, వారు దొరికిన బంగారాన్ని అప్పగించారు. వెంటనే యజమాని ఈ విషయాన్ని స్థానిక పోలీసులకు తెలియజేశారు.

**గతంలోనూ దొరికిన నిధులు**

ఈ భూమిలో బంగారం దొరకడం ఇదే మొదటిసారి కాదని గ్రామస్థులు చెబుతున్నారు. శతాబ్దాల క్రితం ఈ ప్రాంతంలో కాకతీయుల కాలం నాటి పురాతన ఆలయాలు ఉండేవని, కాలక్రమేణా అవి భూమిలో కలిసిపోయాయని స్థానికంగా ప్రచారంలో ఉంది. గతంలో పొలం దున్నుతున్నప్పుడు దేవతా విగ్రహాలు కూడా లభించాయని చెబుతున్నారు. 1991లో అప్పటి భూ యజమానికి వ్యవసాయ పనుల్లో భాగంగా పెద్ద మొత్తంలో బంగారం దొరికిందని, ఆ తర్వాత అదే పొలంలో పనిచేసిన పాలేరుకు కూడా కొన్ని బంగారు నాణేలు లభించాయని గ్రామస్థులు గుర్తు చేసుకుంటున్నారు. తాజా ఘటనతో ఈ భూమి కింద ఇంకా పెద్ద నిధి ఉందనే నమ్మకం బలపడింది.

**కొత్తగా తెరపైకి పాత యజమాని వారసుడు**

ఈ వ్యవహారం పోలీసుల వద్దకు చేరడంతో కథ కొత్త మలుపు తిరిగింది. ఈ భూమిని గతంలో అమ్మేసిన పాత యజమాని కుమారుడు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అది తమ తాతల కాలం నాటి భూమి అని, అందులో దొరికిన నిధిపై తమకే హక్కు ఉందని ఆయన వాదిస్తున్నారు. దొరికిన బంగారాన్ని పంచుకున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని, ఆ నిధిని తమకు అప్పగించాలని ఆయన తన ఫిర్యాదులో కోరారు.

**రాత్రిపూట తవ్వకాలు**

పొలంలో బంగారం దొరికిందనే వార్త చుట్టుపక్కల గ్రామాలకు వేగంగా వ్యాపించింది. దీంతో వందలాది మంది ప్రజలు ప్రతిరోజూ ఆ పొలానికి క్యూ కడుతున్నారు. పగలు పోలీసులు, రెవెన్యూ అధికారుల నిఘా ఉండటంతో, చాలామంది అర్ధరాత్రుళ్లు టార్చ్ లైట్లు, గునపాలతో పొలంలోకి ప్రవేశించి నిధి కోసం తవ్వకాలు జరుపుతున్నారు. దీంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఓవైపు నిధిపై హక్కుల వివాదం, మరోవైపు ప్రజల గాలింపు చర్యలతో ఈ బంగారు భూమి వ్యవహారం అధికారులకు తలనొప్పిగా మారింది.

# రెండేళ్ల కాలంలో రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాం: టీజీ భరత్

**ఈ ప్రాజక్టుల వల్ల దాదాపు 10.32 లక్షల ఉపాధి అవకాశాలు లభిస్తాయని వెల్లడి**

**యువతను పారిశ్రామికవేత్తలుగా మార్చడం ప్రభుత్వ లక్ష్యమన్న మంత్రి**

ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే పారిశ్రామిక అభివృద్ధికి ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం అత్యంత వేగంగా అడుగులు వేస్తోందని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ స్పష్టం చేశారు. గత రెండేళ్ల కాలంలోనే రాష్ట్రం సుమారు రూ.20 లక్షల కోట్ల భారీ పెట్టుబడులను ఆకర్షించడంలో విజయవంతమైందని, ఇందులో రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (SIPB) ఆమోదించిన ప్రాజెక్టుల విలువ రూ.11.77 లక్షల కోట్లుగా ఉందన్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో దాదాపు 10.32 లక్షల మంది యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయని తెలిపారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా మొత్తం పెట్టుబడుల్లో ఏపీ వాటా 24.3 శాతానికి చేరుకుందని, పారిశ్రామిక అనుమతులను వేగంగా ఇస్తూ రాష్ట్రం 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'కు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని



మంత్రి వివరించారు. రాష్ట్ర భవిష్యత్తును మార్చేలా క్వాంటం వ్యాలీ, గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ, స్పేస్ అండ్ డ్రోన్ సిటీ, స్టీల్ ప్లాంట్లు వంటి అత్యాధునిక రంగాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి తెలిపారు. యువతను పారిశ్రామికవేత్తలుగా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం 'ఒక కుటుంబం -- ఒక పారిశ్రామికవేత్త' అనే వినూత్న విధానాన్ని తీసుకొచ్చిందని మంత్రి చెప్పారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా యువతలోని సరికొత్త ఆలోచనలను, ప్రతిభను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. శ్రీహరికోటను కేంద్రంగా చేసుకుని స్పేస్ సిటీతో పాటు స్పేస్ టూరిజాన్ని కూడా ప్రోత్సహిస్తున్నామని మంత్రి తెలిపారు. దేశవ్యాప్తంగా రూ.500 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న 'భవ్య' పార్కుల్లో కనీసం 3 నుంచి 4 పార్కులను ఏపీకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నామని... ఎయిర్‌స్పేస్, డిఫెన్స్ రంగాల్లో రూ.10 వేల కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టేందుకు పలు అంతర్జాతీయ సంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయని వెల్లడించారు.

## భూముల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి..

# తెలంగాణలో సర్వర్లు డౌన్!

**రెండు రోజులుగా పనిచేయని సర్వర్లు!**


**స్తంభించిన స్లాట్ బుకింగ్, చలాన్, ఈ-కేవైసీ సేవలు**

**కార్యాలయాల వద్ద ప్రజలు పడిగాపులు**

**మూడు నెలల్లో ఇది నాలుగోసారి**

**సర్వర్ల పునరుద్ధరణకు సాంకేతిక బృందం కసరత్తు**

తెలంగాణ వ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు స్తంభించిపోయాయి. సాంకేతిక లోపాలతో ప్రధాన సర్వర్లు గత రెండు రోజులుగా పనిచేయడంలేదని తెలుస్తోంది. భూములు, ఇళ్లు, ఇతర ఆస్తుల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. దీంతో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సర్వర్లు పనిచేయకపోవడంతో కొత్త స్లాట్ బుకింగ్‌లు, చలాన్




చెల్లింపులు, ఈ-కేవైసీ వంటి ఆన్‌లైన్ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. ముందుగానే ముహూర్తాలు చూసుకుని స్లాట్‌లు బుక్ చేసుకున్న క్రయ, విక్రయదారులు సాక్షులతో కలిసి కార్యాలయాలకు చేరుకున్నా, గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత మూడు నెలల్లో సాంకేతిక సమస్యల కారణంగా రిజిస్ట్రేషన్ సేవలు నిలిచిపోవడం ఇది నాలుగోసారి కావడం గమనార్హం. తరచూ ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నా శాశ్వత పరిష్కారం కనిపించడం లేదని ప్రజలు, డాక్యుమెంట్ రైటర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాంకేతిక లోపం ఎక్కడ తలెత్తిందనే విషయంపై క్షేత్రస్థాయి అధికారులకు కూడా సమాచారం లేదు. వారు ప్రజలకు సరైన సమాధానం ఇవ్వలేకపోతున్నారు. దీంతో కార్యాలయాల వద్ద గందరగోళం నెలకొంది. సాఫ్ట్‌వేర్‌లో ఏర్పడిన సమస్యను గుర్తించి సర్వర్లను పునరుద్ధరించేందుకు రాష్ట్ర స్థాయి సాంకేతిక బృందం చర్యలు చేపట్టిందని ఉన్నతాధికారులు తెలిపారు. సేవలు ఎప్పటికి పూర్తిస్థాయిలో పునరుద్ధరిస్తారనే విషయంపై మాత్రం ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు.

# ప్రజాప్రతినిధుల కోర్టులో బండి సంజయ్ కి ఊరట

**హుజూరాబాద్ ఉప ఎన్నికల సమయంలో బండి సంజయ్‌పై కేసు నమోదు**



అధికార బీఆర్‌ఎస్ పార్టీ ఓటుకు రూ.25 వేలు పంచుతోందని ఆరోపించిన సంజయ్ ఈ వ్యాఖ్యలపై కేసు నమోదు చేసిన హుజూరాబాద్ పోలీసులు హుజూరాబాద్ ఉప ఎన్నికల సమయంలో నమోదైన ఒక పాత కేసులో కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కు నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు నుంచి పెద్ద ఊరట లభించింది. సుదీర్ఘ విచారణ అనంతరం ఆయనపై నమోదైన కేసును న్యాయస్థానం పూర్తిగా కొట్టివేసింది. అసలు విషయానికి వస్తే... హుజూరాబాద్ ఉప ఎన్నిక ప్రచార సమయంలో అప్పటి అధికార బీఆర్‌ఎస్ పార్టీపై బండి సంజయ్ తీవ్ర ఆరోపణలు చేశారు. అధికార పార్టీ ఓటుకు ఏకంగా రూ.25 వేల వరకు పంచుతోందని, అందులో ఓటర్లకు కేవలం రూ.5 వేలు ఇచ్చి మిగిలిన మొత్తాన్ని బీఆర్‌ఎస్ కార్యకర్తలే నొక్కేస్తున్నారంటూ ఆయన వ్యాఖ్యానించారు. ఈ విమర్శలపై అప్పట్లో తీవ్ర రాజకీయ దుమారం రేగింది. ఈ వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకున్న హుజూరాబాద్ పోలీసులు.. బండి సంజయ్‌పై పలు కఠిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. అయితే, తాజాగా ఈ వ్యవహారాన్ని పరిశీలించిన ప్రత్యేక కోర్టు.. ఆయనపై మోపిన ఆరోపణలకు సరైన ఆధారాలు లేవని స్పష్టం చేస్తూ కేసును కొట్టివేస్తూ తీర్పునిచ్చింది.

## రాజాసింగ్‌కు నాంపల్లి ప్రత్యేక కోర్టులో భారీ ఊరట

**2022లో మునావర్ ఫారూఖీ షోను వ్యతిరేకించిన రాజాసింగ్**

**దేశవ్యాప్తంగా దుమారం రేపిన రాజాసింగ్ వీడియో**

**మంగళ్‌హాట్ పీఎస్ లో కేసులు నమోదు**

**కేసును పూర్తిగా కొట్టివేసిన ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు**



గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌కు నాంపల్లి ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు నుంచి భారీ ఊరట లభించింది. ఆయనపై నమోదైన కేసును కోర్టు పూర్తిగా కొట్టివేస్తూ, రాజాసింగ్‌ను నిర్దోషిగా ప్రకటిస్తూ కోర్టు తుది తీర్పునిచ్చింది. ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాత ఆయనపై మోపిన ఆరోపణలకు సరైన సాక్ష్యాధారాలు లేవని కోర్టు స్పష్టం చేసింది.కేసు వివరాల్లోకి వెళితే... 2022 ఆగస్టులో హైదరాబాద్‌లో స్టాండప్ కమెడియన్ మునావర్ ఫారూఖీ షో నిర్వహించడాన్ని రాజాసింగ్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ క్రమంలో ఆయన యూట్యూబ్‌లో విడుదల చేసిన ఒక వీడియో దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపింది. రాజాసింగ్ మత విద్వేషాలను రెచ్చగొట్టేలా మాట్లాడారంటూ నగరంలోని పలు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీనిపై స్పందించిన మంగళ్‌హాట్ పోలీసులు ఆయనపై 153ఏ, 295ఏ, 505(2) తదితర సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.2022 ఆగస్టు 23న పోలీసులు రాజాసింగ్‌ను అరెస్ట్ చేసినప్పటికీ, అరెస్ట్ ప్రక్రియలో సరైన నిబంధనలు (41ఏ సీఆర్‌పీసీ నోటీసు వంటివి) పాటించలేదంటూ స్థానిక కోర్టు రిమాండ్‌ను తిరస్కరించి, ఆయనను వెంటనే విడుదల చేసింది. అయితే, ఆ తర్వాత నగరంలో చోటుచేసుకున్న నిరసనలు, శాంతిభద్రతల సమస్యలను కారణాంగా చూపిస్తూ హైదరాబాద్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పోలీసులు ఆయనపై పీడీ యాక్ట్ ప్రయోగించారు. దీంతో రాజాసింగ్ దాదాపు 77 రోజుల పాటు జైలులో గడపాల్సి వచ్చింది.

## అరుణాచల్‌లో చైనా చొరబాట్లు

**మీడియా కథనాలను తోసిపుచ్చిన ఆర్మీ**

న్యూఢిల్లీ,: చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ అరుణాచల్ ప్రదేశ్‌లో చొరబాట్లకు పాల్పడిందని, అక్కడ సైనిక శిబిరాలను ఏర్పాటు చేసిందని కొన్ని కథనాలు ప్రచారం కావడంతో, వాటిని భారత సైన్యం తోసిపుచ్చింది. ఆ కథనాల్లో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేసింది. అదంతా ఎలాంటి ఆధారం లేకుండా జరుగుతోన్న అసత్య ప్రచారమని వెల్లడించింది. మీడియా కథనాల ప్రకారం.. అరుణాచల్ ప్రదేశ్ లోని తక్సింగ్ ప్రాంతంలోని నాహ్ ట్రైబల్ గ్రూప్‌నకు చెందిన నాహ్ వెల్ఫేర్ సొసైటీ .. ప్రభుత్వ అధికారులకు గతంలో ఒక వినతి పత్రాన్ని సమర్పించింది. భారత్-చైనా సరిహద్దు సమీపంలో పీఎల్‌ఏ శిబిరాలను ఏర్పాటు చేసిందని అందులో ఆరోపించింది. గత 10- 15 సంవత్సరాలుగా చైనా సైనికులు తక్సింగ్ సరిహద్దు వెంట చొరబాట్లను క్రమంగా విస్తరిస్తున్నారని పేర్కొంది. వేట, పశువుల మేత, అటవీ ఉత్పత్తుల సేకరణ కోసం స్థానికులు ఉపయోగించే ప్రదేశాల్లో రోడ్లు, వంతెనలు, సైనిక శిబిరాలను నిర్మించారని ఆరోపించింది. ఆ ప్రాంతాల పేర్లను ప్రస్తావించింది. భారత సరిహద్దు ప్రాంతాల్లో చైనా కార్యకలాపాలు మరింత విస్తరించకుండా నిరోధించేలా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలని కోరింది. ఈ వినతి పత్రాన్నే మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలోనే ఆర్మీ స్పందన వచ్చింది.ఇటీవల బీజింగ్‌లో భారత్-చైనా సరిహద్దు వ్యవహారాలకు సంబంధించిన సమావేశం జరిగింది. రెండు దేశాల మధ్య నిర్మాణాత్మక చర్చలు జరిగాయని విదేశాంగ శాఖ వెల్లడించింది. ఈ నేపథ్యంలోనే మీడియా కథనాలు రావడం గమనార్హం.

## తృణమూల్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ

**పార్టీ బ్యాంక్ ఖాతాల ఫ్రీజ్‌పై అత్యవసర విచారణకు నో**

కోల్‌కతా: తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి కోల్‌కతా హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ బ్యాంక్ ఖాతాల ఫ్రీజింగ్‌ను సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌పై అత్యవసర విచారణ జరపాలన్న టీఎంసీ విజ్ఞప్తిని న్యాయస్థానం తిరస్కరించింది. టీఎంసీ బ్యాంక్ ఖాతాల నిలిపివేత కారణంగా పార్టీ కార్యకలాపాలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని, తక్షణ విచారణ అవసరమని ఆ పార్టీ తరఫు న్యాయవాదులు న్యాయస్థానాన్ని కోరారు. అయితే ఈ అంశంలో ఎలాంటి అత్యవసర పరిస్థితి కనిపించడం లేదని పేర్కొంటూ కోల్‌కతా హైకోర్టు వెంటనే విచారణ చేపట్టేందుకు నిరాకరించింది. ఈ కేసును విచారించిన జస్టిస్ అమృతా సిన్హా సాధారణ లిస్టింగ్ ప్రక్రియ ప్రకారమే పిటిషన్ విచారణ జరుగుతుందని స్పష్టం చేశారు.



# ఫైట్‌కి సై

లేడీ ఓరియంటెడ్ సినిమాల్లో కథానాయికలు పవర్‌ఫుల్ రోల్ చేయడం అనేది తెలిసిందే. అయితే అప్పుడప్పుడూ హీరో ఓరియంటెడ్ సినిమాల్లోనూ అలాంటి పాత్రలు హీరోయిన్లకు వస్తుంటాయి. అయితే అది అరుదుగా జరుగుతుంటుంది. ప్రస్తుతం నయనతారకు అలాంటి ఒక అవకాశం దక్కిందని సమాచారం. సల్మాన్ ఖాన్ సరసన నయనతార ఓ హిందీ--తెలుగు ద్విభాషా చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో ఆమె పాత్ర కొన్ని సంభాషణలకు, పాటలకు మాత్రమే పరిమితం కాదన్నది తాజా టాక్. నయనతార పాత్రకు యాక్షన్ సన్నివేశాలు ఉన్నాయట. ఆమెది పవర్‌ఫుల్ యాక్షన్ క్యారెక్టర్ అని తెలుస్తోంది. ఇప్పటికే ఈ చిత్రం కోసం కొన్ని భారీ ఫైట్ సీక్వెన్స్‌కి సంబంధించిన చిత్రీకరణలో నయనతార పాల్గొన్నారట. ఈ సీన్స్ తీసే ముందు బాగా రిహార్సల్స్ చేసి కెమెరా ముందుకొచ్చారట ఈ బ్యూటీ. ఇప్పటివరకూ ఈ చిత్రం షూటింగ్ ముంబై, హైదరాబాద్ ప్రాంతాల్లో జరిగింది. ఈ షూటింగ్ చూసినవారు సల్మాన్--నయనతారల కెమిస్ట్రీ బాగుందని అంటున్నారు. అలాగే సల్మాన్--నయనతార పాల్గొన్న యాక్షన్ సీన్స్ కూడా అదిరిపోయేలా ఉన్నాయట. వంశీ పైడిపల్లి దర్శకత్వంలో 'దిల్' రాజు నిర్మిస్తున్న ఈ చిత్రం 2027 ఈద్‌కి రిలీజ్ కానుంది.





# ఏ ప్రాంతానికి వెళ్లినా స్థానిక భాషలో మాట్లాడటానికే ప్రయత్నిస్తా: శ్రీలీల

టాలీవుడ్ యంగ్ సెన్సేషన్ శ్రీలీల ఇండస్ట్రీలోకి వచ్చిన అతి తక్కువ సమయంలోనే తన అద్భుతమైన డాన్స్, చలాకీతనంతో యువతలో విపరీతమైన క్రేజ్ సంపాదించుకుంది. ఇటీవల కొన్ని సినిమాలు ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోయినప్పటికీ, ఈ అమ్మడికి టాలీవుడ్‌తో పాటు ఇతర పరిశ్రమల్లోనూ వరుస అవకాశాలు క్యూ కడుతున్నాయి. ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ 'ఐ-55' ప్రాజెక్ట్‌తో పాటు, బాలీవుడ్‌లో కార్తీక్ ఆర్యన్ సరసన 'ఆషికీ-3' చిత్రంలో నటిస్తూ బిజీగా ఉంది.భాషా భేదాలు లేకుండా ఇండియన్ సినిమాలో దూసుకుపోతున్న శ్రీలీల... తాజాగా భాష, సంస్కృతిపై చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వివిధ చిత్ర పరిశ్రమల్లో పనిచేయడంపై ఆమె మాట్లాడుతూ.. "నేను ప్రతి భాషను ఎంతో గౌరవిస్తాను. ప్రస్తుతం నాలుగు, ఐదు భాషల్లో ప్రాజెక్టులు చేస్తున్నాను. నేను ఏ కొత్త ప్రాంతానికి వెళ్లినా, స్టేజ్ పైన ఉన్నంతసేపూ అక్కడి స్థానిక భాషలోనే మాట్లాడటానికి ప్రయత్నిస్తాను. ఆ ప్రాంత ప్రజలకు, వారి సంస్కృతికి నేను ఇచ్చే కనీస గౌరవం అది" అని స్పష్టం చేసింది.పబ్లిక్ ఈవెంట్స్‌లో స్థానిక భాషలో మాట్లాడటం వల్ల ప్రేక్షకులకు, సెలబ్రిటీలకు మధ్య ఉన్న దూరం తగ్గి, ఒక మంచి అనుబంధం ఏర్పడుతుందని శ్రీలీల అభిప్రాయపడింది. ఇది కేవలం సినిమా పబ్లిసిటీ కోసం చేసే పని కాదని, మనకు గుర్తింపునిచ్చిన ఆయా ప్రాంతాల ఐడెంటిటీని గౌరవించడమేనని తెలిపింది.

# ఎన్టీఆర్ అభిమాని కావడం ఓ వరం

'దేశసంస్కృతినీ, జాతి ఔన్నత్యాన్ని, మాతృభాష గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిన మహనీయుల స్మారక చిహ్నాలను ఏర్పాటు చేయడంలో.. జయంతులు, వర్ధంతులు జరుపుకోవడంలో అంతరార్థం.. ఆధునికత వైపు పరుగులు తీస్తున్న నేటి తరానికి వారి ఔన్నత్యాన్ని గుర్తు చేయడమే. నేడు అన్న నందమూరి తారకరామారావు జయంతి. తెలుగుజాతి గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిన మహనీయుల్లో అన్న ఎన్టీఆర్ అగ్రగణ్యుడు. ఆయన గొప్పతనాన్ని ముందు తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిది' అని ఎన్టీఆర్ వీరాభిమాని, ప్రముఖ దర్శకుడు వైవీఎస్ చౌదరి అన్నారు. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, మహానటుడు స్వర్గీయ నందమూరి తారకరామారావు జయంతి సందర్భంగా వైవీఎస్ చౌదరి 'నమస్తే తెలంగాణ'తో ప్రత్యేకంగా ముచ్చటించారు. ఇంకా చెబుతూ 'నా పరిపూర్ణ పరిశుద్ధ హృదయంతో నిరంతరం అన్న ఎన్టీఆర్‌ని స్మరించుకుంటూనే ఉంటాను.ఎన్టీఆర్ అభిమానిగా పుట్టడం ఒక వరం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఎన్టీఆర్ అభిమానులందరి చేత వీరాభిమానిగా కొనియాడబడటం ఇంకా గొప్పవరం. ఆయన్ను కలవగలగడం, కలిసి ప్రయాణించగలగడం మహద్భాగ్యం. ఏ రంగంలో ఆయన ఆరాధింపబడ్డారో, అదే రంగంలో గుర్తింపు తెచ్చుకోవడం పూర్వజన్మ సుకృతం. ఇవన్నీ నాకు మాత్రమే దక్కిన అదృష్టాలు. ఇంతటి అదృష్టాన్ని ప్రసాదించిన దైవానికి ఎల్లవేళలా రుణగ్రస్తుడనే' అని వైవీఎస్ చౌదరి పేర్కొన్నారు.





# అప్పలసూరి గుర్తుండిపోతాడు!

ఇప్పటివరకు తాను చేసిన చిత్రాల్లో 'పెద్ది' చాలా ప్రత్యేకమని, ఇందులో అప్పలసూరిగా బలమైన భావోద్వేగాలు కలబోసిన పాత్రలో కనిపిస్తానని, ప్రేక్షకుల మదిలో నిలిచిపోయే పాత్ర ఇదని చెప్పారు సీనియర్ నటుడు జగపతిబాబు. రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందిన ఈ రూరల్ స్పోర్ట్స్ డ్రామా జూన్ 4న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా బుధవారం జగపతిబాబు విలేకరులతో సినిమా విశేషాల్ని పంచుకున్నారు. సెట్స్‌లో తొలిసారి అప్పలసూరి గెటప్ వేసుకున్నప్పుడే ఈ పాత్ర అద్భుతంగా ఉంటుందని అర్థమైంది. జాతీయ అవార్డు గ్రహీత రషీద్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నా లుక్‌ని డిజైన్ చేశారు. ఈ సినిమాలో జగపతిబాబు కాదు..తెరపై కేవలం అప్పలసూరి పాత్ర మాత్రమే కనిపిస్తుంది.ఎమోషన్స్, గెటప్ పరంగా నాకు చాలా నచ్చిన పాత్ర ఇది. రామ్‌చరణ్ సినిమాలో ఈ క్యారెక్టర్ చేయడం మరింత ఆనందాన్నిచ్చింది. అతన్ని నాతో పాటు మా ఫ్యామిలీలో అందరూ ఇష్టపడతారు. చరణ్ పలకరింపులోనే ఓ ఆప్యాయత ఉంటుంది. వ్యక్తిగా చాలా మంచివాడు. 'రంగస్థలం' నుంచి రామ్‌చరణ్ నటుడిగా ఎంతో పరిణతి సాధిస్తున్నారు. ప్రతీ సినిమాలో మరింత అందంగా కనిపిస్తున్నారు.'లెజెండ్' తర్వాత చాలా సినిమాలు చేశా. వాటిలో గుర్తుపెట్టుకునేవి ఓ ఆరుంటాయి. ఆ జాబితాలో అప్పలసూరి పాత్ర మొదటిస్థానంలో ఉంటుంది. ఇందులో నేను పోషించింది తండ్రి పాత్ర కాదు. ప్రేమ, అనుబంధం కలబోసిన పాత్రలో కనిపిస్తా. రామ్‌చరణ్ పాత్రతో ఎమోషనల్ బాండింగ్ ఉంటుంది.ఈ సినిమా డబ్బింగ్ విషయంలో ప్రత్యేకశ్రద్ధ తీసుకున్నా. అప్పలసూరి పాత్ర వాయిస్‌తోనే ఎలివేట్ అవుతుంది. అతను మాట్లాడుతున్నప్పుడు ఇంకెవ్వరూ కనిపించకూడదు అనేది నా ప్రయత్నం. అందుకే ఓ రోజంతా కూర్చొని కేవలం రెండు డైలాగులు మాత్రమే చెప్పిన సందర్భాలున్నాయి.

# మీరు గర్వించేలా నటిస్తాను

మరాఠీ మందారం భాగ్యశ్రీబోర్సే భావోద్వేగానికి లోనైంది. జాతీయ నటుడు కమల్‌హాసన్ సొంత నిర్మాణ సంస్థలో నిర్మితమవుతున్న 'సెయాన్' చిత్రంలో ఆమె కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ ముద్దుగుమ్మ కమల్‌హాసన్‌ని కలిసింది. ఈ సందర్భంగా ఆయనతో దిగిన ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ.. 'డియర్ కమల్‌హాసన్ సార్.. చిన్నప్పట్నుంచీ మిమ్మల్ని తెరపై చూస్తూ పెరిగాను. ఇప్పుడు ఈ చిన్న అమ్మాయి మీ సినిమాలోనే నటిస్తున్నది. నా తలపై చేయి ఉంచి, మీరు ఆశీర్వదించినప్పుడు నేను అనుభవించిన ఆనందాన్ని మాటల్లో వర్ణించలేను. మీరు గర్వపడేలా నటిస్తానని ప్రమాణం చేస్తున్నాను' అంటూ రాసుకొచ్చింది భాగ్యశ్రీ బోర్సే. ఇక 'సెయాన్' సినిమా విషయానికొస్తే.. ఇది గ్రామీణ నేపథ్యంతో కూడిన కథ. మాస్ యాక్షన్, వినోదంతోపాటు కుటుంబ ప్రేక్షకుల్ని అలరించే భావోద్వేగాలు కూడా ఈ కథలో ఉంటాయని మేకర్స్ చెబుతున్నారు. 'అమరన్' విజయం తర్వాత కమల్‌హాసన్ నిర్మాణసంస్థలో శివకార్తికేయన్ నటిస్తున్న రెండో సినిమా ఇది. శివకుమార్ మురుగేశన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం అక్టోబర్‌లో విడుదల కానున్నది.



Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.